- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

సోమవారం
12-10-2026

సంపుటి : 01 సంచిక :201 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 201 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

అట్టుడికిన హస్తిన

ఢిల్లీలో వరుసగా రెండో రోజూ సీజేపీ ఆందోళనలు

- జ్ఞానేశ్ కుమార్ దిగిపోయే వరకు వెనక్కి తగ్గేది లేదు
- రోడ్లపైనే ఉంటాం.. పోరాటం కొనసాగిస్తాం: అజింక్య శిండే
- జంతర్‌మంతర్ వెళ్లేందుకు యత్నించిన విద్యార్థుల అరెస్టు
- భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు
- నిరసనకారులపై బలప్రయోగం చేశారని విద్యార్థి సంఘాల ఆరోపణ
- ముంబై శివాజీ పార్కులోనూ ఆందోళనకు పిలుపు
- నేడు మరోసారి నిరసనలకు ఇండియా కూటమి సన్నాహాలు
- సీజేపీ నేతలతో భేటీకి సమయం కోరిన రాహుల్ గాంధీ
- యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలి: రాహుల్



ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో సీజేపీ చేపట్టిన ఆందోళనలు ఢిల్లీలో వరుసగా రెండో రోజూ కొనసాగాయి. జంతర్‌మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకోగా, భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాలను మోహరించారు. అరెస్టులు, ఆంక్షలతో ఉద్యమాన్ని అణచలేరని, డిమాండ్ నెరవేరే వరకు రోడ్లపైనే ఉండి పోరాడతామని సీజేపీ నేత అజింక్య శిండే స్పష్టం చేశారు. మరోవైపు, ముంబైలోని శివాజీ పార్కుకు ఆందోళనలను విస్తరించేందుకు సన్నాహాలు జరుగుతుండగా, ఇండియా కూటమి నేతలు కూడా నిరసనలకు సిద్ధమవుతున్నారు. సీజేపీ నేతలతో సమావేశానికి రాహుల్ గాంధీ సమయం కోరినట్లు సమాచారం.

03



03

విండీస్‌పై భారత్ విక్టరీ

- సిరీస్‌లో 2-1తో ఆధిక్యం.. ఉప్పల్‌లో నాలుగో టీ20
- మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఘన విజయం
- అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్.. 69 పరుగులతో మెరుపులు
- ఇషాన్ కిషన్ దూకుడు.. చివర్లో తిలక్, అక్షర్ కీలక పరుగులు
- 223 పరుగులకు ఆలౌటైన భారత జట్టు
- 209 పరుగులకే పరిమితమైన వెస్టిండీస్
- అర్షదీప్ సింగ్ మూడు వికెట్లతో సత్తా
- చివర్లో షమర్ స్ప్రింగర్ పోరాటం వృథా
- అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నాలుగో టీ20



సిద్ధిపేట గడ్డ నుంచే మళ్లీ ఉద్యమం!

- రేవంత్ పాలనలో కృత్రిమ కరువు
- నదుల్లో నీళ్లున్నా ప్రాజెక్టుల మోటార్లు బంద్
- వేల కోట్ల అభివృద్ధి పనులకు బ్రేకులు
- రుణమాఫీ అందని రైతులు 24 వేల మంది
- సిద్ధిపేట జిల్లా దశాబ్ది ఉత్సవాల ముగింపు సభలో హరీశ్‌రావు
- బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకొస్తామని ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 11, (మహాప్రభ):
సిద్ధిపేట గడ్డ నుంచే రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటుకు ఉద్యమాన్ని ప్రారంభిస్తామని ఆ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రకటించారు. రాష్ట్రంలో నెలకొన్నది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన కృత్రిమ కరువని ఆరోపించారు. నదుల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ సాగునీటి ప్రాజెక్టుల మోటార్లను పూర్తిస్థాయిలో నడపడం లేదని, విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సిద్ధిపేట జిల్లా ఏర్పడి దశాబ్ది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కేసీఆర్ చిత్రపటానికి గోదావరి జలాలతో జలాభిషేకం చేశారు. సిద్ధిపేట జిల్లా ఏర్పాటుతో పాలన ప్రజలకు చేరువైందని హరీశ్‌రావు అన్నారు.

-మిగతా 3 లో

డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా గోవా

హైదరాబాద్‌కు గోవా నుంచే మత్తు పదార్థాల సరఫరా



- ప్రమోద్ సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్
- డ్రగ్స్ నియంత్రణలో బీజేపీ ప్రభుత్వం విఫలం
- పేదలు, దళితులు, మైనార్టీల ఓట్లు తొలగించే కుట్ర
- జ్ఞానేష్ కుమార్‌ను అడ్డుపెట్టుకుని ఓట్ల తొలగింపు
- 2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు
- రాహుల్ గాంధీ ప్రతినిధిగా గోవాకు వచ్చా
- పనాజీలో కాంగ్రెస్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి
- 'గోయ్ రాథోన్స్' యాత్రలో పాల్గొన్న తెలంగాణ సీఎం

హైదరాబాద్, అక్టోబర్ 11, (మహాప్రభ):
: గోవా డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా మారిందని, అక్కడి నుంచే హైదరాబాద్‌కు మత్తు పదార్థాలు సరఫరా అవుతున్నాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. డ్రగ్స్ కారణంగా గోవా ప్రతిష్ట దెబ్బతినకూడదని, యువతను మత్తు పదార్థాల బారి నుంచి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఆదివారం పనాజీలో కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ గోవా పర్యటనకు రావాల్సి ఉన్నప్పటికీ, ఢిల్లీలో నిరసన కార్యక్రమాల కారణంగా రాలేకపోయారని రేవంత్ రెడ్డి తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ ప్రతినిధిగా తనను గోవాకు పంపించారని వెల్లడించారు. గోవాలో కాంగ్రెస్ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ కట్టుబడి ఉందన్నారు.

-మిగతా 3 లో




03

రష్యా--ఉక్రెయిన్ మధ్య సీజ్‌ఫైర్!

- ట్రంప్ ప్రకటనతో యుద్ధానికి విరామం?
- తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని వెల్లడి
- ట్రూత్ సోషల్‌లో ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్
- ఇంధన రంగంపై దాడులు నిలిపివేసేందుకు అంగీకారం
- ఒప్పందాన్ని ఉల్లంఘించొద్దని ఇరు దేశాలకు సూచన
- కాల్పుల విరమణపై తమకు సమాచారం లేదన్న ఉక్రెయిన్ వర్గాలు
- ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా ఉత్కంఠ

ఏఐ, అణు యుద్ధంతో 2100 నాటికి మానవాళి అంతం

03



రైతులు రెండో పంటతో నష్టపోవద్దు

ఎల్నినో ప్రభావం పట్ల అప్రమత్తంగా ఉండాలి



- యూనిట్‌కు రూ.15 చెల్లించినా విద్యుత్తు దొరకని పరిస్థితి
- తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శతవిధాల కృషి
- భవిష్యత్తులో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలకు ప్రణాళిక
- కంద్రాన్ని కలిసి తెలంగాణకు ప్రత్యేక ప్యాకేజీ కోరతాం
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

తెలంగాణ బ్యూరో ప్రతినిధి అక్టోబర్ 11, (మహాప్రభ):
ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర జల వనరుల సంక్షోభ పరిస్థితులు నెలకొన్నాయని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఇప్పటికే రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండో పంట వేసి ఇబ్బందులు పడొద్దని విజ్ఞప్తి చేశారు. ఆదివారం కూసుమంచి మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. నిధులు రూ.1.63 కోట్లతోమంగలితండా--దుబ్బతండా మధ్య నిర్మించనున్న బీటీ రహదారి పనులకు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం జుజ్జుర్ రావుపేటలో రూ. 45 లక్షలతో చేపట్టనున్న ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ పనులకు

-మిగతా 3 లో



03

నేపాల్‌లో మళ్లీ వరద బీభత్సం!

నేలమట్టమైన ఇళ్లు, బ్రిడ్జిలు..!

- గోర్ఖా జిల్లాలో అకస్మాత్తుగా విరుచుకుపడిన వరద
- వరద ఉధృతికి 34 ఇళ్లు, పలు వంతెనలు ధ్వంసం
- రెండు గంటల్లో 3.66 నుంచి 8.43 మీటర్లకు పెరిగిన నీటిమట్టం
- తీవ్రంగా దెబ్బతిన్న జలవిద్యుత్ కేంద్రం
- ప్రాణనష్టం లేదన్న విపత్తు నిర్వహణ సంస్థ
- రంగంలోకి దిగిన నేపాల్ సైన్యం.. సహాయక చర్యలు ముమ్మరం
- లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



సిరిసిల్ల జేఎన్‌టీయూ సమస్యలను పరిష్కరించండి!

- కొత్త క్యాంపస్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి
- రూ.402 కోట్లతో 2021లోనే పరిపాలనా అనుమతులు
- మండేపల్లిలో 20 ఎకరాల భూమి కేటాయింపు
- నిర్మాణంలో జాప్యంతో విద్యార్థులకు ఇబ్బందులు
- ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనను విరమించాలి
- కొత్త క్యాంపస్ పూర్తయ్యే వరకు ప్రస్తుత ప్రాంగణంలోనే కొనసాగించాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 11, (మహాప్రభ):
రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి, విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కళాశాల ప్రస్తుత పరిస్థితులను ప్రస్తావించారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి 2021లోనే రూ.402 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని కేటీఆర్ గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మండేపల్లి గ్రామంలో 20 ఎకరాల భూమిని కేటాయించినట్లు

-మిగతా 3 లో

ప్రభుత్వం మారినా రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం..



న్యూఢిల్లీ అక్టోబర్ 11, (మహాప్రభ):
తమిళనాడులో ప్రభుత్వం మారినప్పటికీ ఆ రాష్ట్రంపై తన నిబద్ధత మారదని ప్రధాని మోదీ అన్నారు. అంతేకాదు.. తమిళనాడు సీఎం విజయ్‌తో కలిసి రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తాం అన్నారు. చెన్నైలో పూనమల్లి–వడపళని మార్గంలోని మెట్రో రైలును సీఎం విజయ్‌తో కలిసి ప్రధాని మోదీ ఆదివారం ప్రారంభించారు. ఇదే సమయంలో రాష్ట్రంలో రూ.13,000 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రధాని ప్రసంగం చేశారు.'ఈరోజు తమిళనాడు చరిత్రలో చారిత్రాత్మక రోజు. రవాణా, పరిశ్రమలు, వ్యాపారం, నిర్మాణం వంటి రంగాల్లో రూ.13,000 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించాం. కొన్ని పనులను ప్రారంభించగా.. ఇంకొన్నింటికి శంకుస్థాపనలు చేశాం. తాము చేపడుతున్న అభివృద్ధి పనులు తమిళనాడు యువతకు పలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. నేను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇక్కడి సీఎంలు కరుణానిధి, జయలలిత వంటి వారితో కలిసి పని చేశా. అలాగే, ప్రధానిగా ఉన్న సమయంలో జయలలిత, పన్నీర్ సెల్వం, పళనిస్వామి, ఎంకే స్టాలిన్‌లతో కూడా పని చేశా. ప్రభుత్వాలు మారాయి. కానీ, తమిళనాడు అభివృద్ధి, ఇక్కడి ప్రజలకు సేవ చేసే విషయంలో నా దృక్పథం మాత్రం మారలేదు. నేను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వారి ఆలోచనలు, ఆకాంక్షలు ఎలా ఉంటాయో ఆలోచించా. అందుకే ప్రధాని అయిన తర్వాత వాటిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నా. ప్రతి రాష్ట్రం తమ సొంత లక్ష్యాలను సాధించుకోవాలి" అని మోదీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం విజయ్‌తోపాటు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ కూడా పాల్గొన్నారు. మెట్రో రైలులో ప్రయాణించిన సందర్భంగా మోదీ రైలు టిక్కెట్ కొనుగోలు చేయడం విశేషం.

అమెరికాను అతలాకుతలం చేసిన హరికేన్ ఇసైయాస్..

-టోర్నడో ముప్పు ఉందని హెచ్చరిక..!



న్యూఢిల్లీ అక్టోబర్ 11, (మహాప్రభ):
అగ్రరాజ్యం అమెరికా దక్షిణ ప్రాంతాన్ని 'ఇసైయాస్ ' హరికేన్ అతలాకుతలం చేసింది. తుఫాను కారణంగా వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతిచెందారు. ఫ్లోరిడా, అలబామా, జార్జియా, మిస్సిసిపి రాష్ట్రాల్లో దాదాపు 6.7 లక్షల మంది నివాసితులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.తుఫాను బలహీనపడినప్పటికీ ఈదురుగాలులు, ఆకస్మిక వరదలు, టోర్నడో ముప్పు పొంచి ఉందని నేషనల్ హరికేన్ సెంటర్ హెచ్చరించింది. పసిఫిక్ మహాసముద్రంలో 'రాచెల్' తుఫాను కారణంగా కాలిఫోర్నియాలోనూ 7,000 మందికి కరెంట్ కోతలు విధించారు. ఫ్లోరిడాలోని డెస్టిన్ సమీపంలో గంటకు సుమారు 105 మైళ్ల వేగంతో వీచే గాలులతో కేటగిరీ 2 హరికేన్‌గా తీరాన్ని తాకిన ఇసైయాస్ అనే ఉష్ణమండలానంతర తుఫాను, శనివారం బర్మింగ్‌హామ్ సమీపంలో మధ్య అలబామా గుండా ఈశాన్య దిశగా కదులుతోంది. ఈ తుఫాను కారణంగా ఇప్పటివరకు కనీసం నలుగురు మరణించారు. అలబామా, ఫ్లోరిడా పాన్‌హ్యాండిల్‌లో చెట్లు, విద్యుత్ తీగలు నేలకూలడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని, దాంతో శుక్రవారం రాత్రి రోడ్లను మూసివేయాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. అలబామా, ఫ్లోరిడా పాన్‌హ్యాండిల్, పశ్చిమ జార్జియాలోని చాలా ప్రాంతాల్లో లక్షలాది ఇళ్లు, వ్యాపార సంస్థలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

పడవ బోల్తా.. 139 మంది మృతి

116 మందికి పైగా గల్లంతు.. జిబౌతీలో దారుణం



ఒబాక్ అక్టోబర్ 11, (మహాప్రభ):
ఆఫ్రికాలోని జిబౌతీ సముద్ర జలాల్లో దారుణం జరిగింది. యెమెన్‌కు 350 మంది వలసదారులతో వెళ్తున్న పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 139 మంది చనిపోగా.. ఇందులో 15 మంది పిల్లలు ఉన్నారు. 116 మందికి పైగా గల్లంతయ్యారు. ఈ ఘటనలో 80 మందికి పైగా ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడ్డట్టు తెలుస్తున్నది. ప్రాణాలతో బయటపడ్డవారు తెలిపిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 8–9తేదీల మధ్య రాత్రి జిబౌతీలోని ఓడరేవు పట్టణమైన ఒబాక్‌కు ఉత్తరాన గుహేరే సమీపంలో ఈ పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

రియాద్ ఎయిర్‌పోర్టుపై దాడిని తీవ్రంగా ఖండించిన భారత్..!

న్యూఢిల్లీ అక్టోబర్ 11, (మహాప్రభ):
సౌదీఅరేబియా రాజధాని నగరం రియాద్ లోని అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు పై జరిగిన క్షిపణి దాడి ని భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడిలో 12 మంది ప్రాణాలు కోల్పోవడమేగాక 300 మందికిపైగా గాయపడటంపట్ల విచారం వ్యక్తంచేసింది. పౌరులను లక్ష్యంగా చేసుకుని, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని జరిపే ఇలాంటి దాడులు మళ్లీమళ్లీ పునరావృతం కావడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది.గత దశాబ్ద కాలంలో సౌదీగడ్డపై జరిగిన అత్యంత భయానక దాడిగా తాజా దాడిని భావిస్తున్నారు. రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల కోసం



కేటాయించిన టెర్మినల్స్ 3, 4 ఉన్న ప్రాంతంలో ఈ క్షిపణి దాడి జరిగింది. అక్టోబర్ 10న జరిగిన ఈ దారుణ ఘటనతోపాటు గత కొన్ని రోజులుగా రియాద్ విమానాశ్రయంపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొన్నది. 'పౌరులపై దాడులను తక్షణమే నిలిపివేయాలి' అని ఆ ప్రకటనలో డిమాండ్ చేసింది. సౌదీ అరేబియా సార్వభౌమత్వాన్ని కాపాడుకునే విషయంలో ఆ దేశ ప్రజలకు, ప్రభుత్వానికి భారత్ అండగా నిలుస్తుందని విదేశాంగశాఖ తెలిపింది. ఈ ప్రాంతంలో వీలైనంత త్వరగా శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆకాంక్షించింది. ఈ దాడి వెనుక యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతున్న హౌతీ తిరుగుబాటుదారుల హస్తం ఉందని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. మృతుల్లో సౌదీ, బంగ్లాదేశ్, పాలస్తీనా, అమెరికా, ఈజిప్ట్, జోర్డాన్, సిరియా, సూడాన్ పౌరులు ఉన్నారు. ఈ వారంలో రియాద్ విమానాశ్రయంపై ఇది మూడో దాడి కావడం గమనార్హం.

ఇంటర్నెట్ ఆపొద్దు.. మెట్రో రైళ్లు నడపండి.

సీజేపీ నిరసనల వేళ కేంద్రానికి సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ అక్టోబర్ 11, (మహాప్రభ):
సీజేపీ నిరసనల వేళ ఢిల్లీలో పోలీసులు కఠినమైన ఆంక్షల్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు స్పందించింది. బారికేడ్లు తొలగించాలని, ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని, మెట్రో రైళ్లు యథాతథంగా నడపాలని ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ పోలీసులకు ఆదివారం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన నేపథ్యంలో ఢిల్లీలో శనివారం పోలీసులు భారీ ఆంక్షలు విధించారు. నిరసన జరిగే జంతర్ మంతర్‌తోపాటు అనేక చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఢిల్లీ పరిధిలోని 50కిపైగా మెట్రో



రైలు స్టేషన్లను మూసేసి, రైలు సర్వీసుల్ని నిలిపివేశారు. ఇంటర్నెట్ సేవల్ని రద్దు చేశారు. దీంతో ఢిల్లీలో ఒక నిర్బంధ, ఎమర్జెన్సీ వాతావరణం తలపిస్తోంది. దీంతో ఈ అంశంపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పందించింది. జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి మోహన ఆధ్వర్యంలోని ధర్మాసనం ఆదివారం అత్యవసరంగా విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఢిల్లీలో ప్రజా జీవితం సాధారణ స్థితికి చేరుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరించాలని, మెట్రో రైళ్లు ప్రారంభించాలని, బారికేడ్లు తొలగించాలని సూచించింది. ప్రజలను అనవసరంగా, ప్రతి చోటా తనిఖీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. సీజేపీ నిరసన సందర్భంగా అత్యవసరమని భావిస్తే తప్ప ఈ ఆంక్షలు విధించకూడదని సూచించింది. శాంతి భద్రతలకు నిజంగా విఘాతం కలుగుతుందని భావించినప్పుడే ఈ ఆంక్షలు అమలు చేయాలని వివరించింది. ఈ మేరకు ఢిల్లీ పోలీసులు, కేంద్ర హోం శాఖ సెక్రెటరీ, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ తీర్పు వెలువడటానికి ముందే సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే సహా కీలక నేతల్ని విడుదల చేయాలని మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించి

పాకిస్తాన్, ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఎమర్జెన్సీ..

న్యూఢిల్లీ అక్టోబర్ 11, (మహాప్రభ):
పాకిస్తాన్‌లో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అనే మాటలకు పెద్దగా విలువుండదు. అక్కడ అంతా నియంతృత్వమే. ఎవరు అధికారంలో ఉంటే వారిదే పెత్తనం. ఇందుకు తాజా పరిణామాలే ఉదాహరణ. పాకిస్తాన్‌లోని కీలక ప్రాంతమైన ఖైబర్ పఖ్తుంఖ్వాలో అక్కడి సమాఖ్య ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించింది. అక్కడ అధికారంలో ఉన్న పీటీఐ (పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్) ప్రభుత్వాన్ని రద్దు చేసింది. రాష్ట్ర సీఎం సోహైల్ ఆఫ్రిదితోపాటు ఆరుగురు క్యాబినెట్ మంత్రుల్ని అరెస్టు చేసింది.పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆధ్వర్యంలోని సమాఖ్య ప్రభుత్వం దీనిపై ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ రద్దు, ఎమర్జెన్సీ, సీఎం, మంత్రుల అరెస్టు కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 232, 234ను ప్రభుత్వం ఉపయోగించింది. ఈ నిర్ణయానికి రాష్ట్రపతి అసిఫ్ అలీ జర్దారీ అంగీకారం తెలిపారు. పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం జైలులో ఉన్న సంగతి



తెలిసిందే. ఆయనను షరీఫ్ ప్రభుత్వం అరెస్టు చేసి, జైలు నుంచి విడుదల కాకుండా చూస్తోంది. దీంతో ఆయన మద్దతుదారులు ఇటీవల ఆందోళన నిర్వహించారు. దీనిలో భాగంగా ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పీటీఐ అధికారంలో ఉన్న ఖైబర్ పఖ్తుంఖ్వా సీఎం ఆఫ్రిది ఈ నెల 4న ర్యాలీ నిర్వహించారు. ఇమ్రాన్‌ను విడుదల చేయాలని కోరుతూ ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ర్యాలీ నిర్వహించి ఇబ్బంది కలిగించినందుకుగాను షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం.. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రభుత్వాన్ని రద్దు చేసి, ఎమర్జెన్సీ విధించింది. దీంతో ఇప్పుడు అక్కడ శాంతి భద్రతలు, పాలన సహా మొత్తం అధికారం స్థానిక గవర్నర్ పరిధిలో ఉంటుంది. ఈ అంశంపై సీఎం సోహైల్ ఆఫ్రిది స్పందించారు. తమ ప్రభుత్వాన్ని రద్దు చేసినా, గవర్నర్ పాలన విధించినా తమ డిమాండ్ల విషయంలో వెనుకడుగు వేయబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమాఖ్య ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై . ఖైబర్ పఖ్తుంఖ్వా పరిధిలోని ప్రజలు, మద్దతుదారులు భారీ ఎత్తున నిరసన చేపట్టారు. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా . ఖైబర్ పఖ్తుంఖ్వా రాజధాని పెషావర్‌లో రోడ్లపై భారీ షిప్పింగ్ కంటైనర్లను అడ్డుగా పెట్టారు. నగరవ్యాప్తంగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు ఇస్లామాబాద్‌లోని ప్రధాని నివాసం వద్ద కూడా గట్టి భద్రత ఏర్పాటు చేశారు.

పోరాటం ఇప్పుడే మొదలైంది..

-జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేవరకూ వెనక్కి తగ్గబోం
-దేశ రాజధానిలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు
-సీఈసీని కాపాడేందుకు సొంత ప్రజలపైనే యుద్ధమా?
-కేంద్ర సర్కార్‌పై సీజేపీ ఫైర్

న్యూఢిల్లీ అక్టోబర్ 11, (మహాప్రభ):
: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలను దేశవ్యాప్తం చేస్తామని కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) నేతలు ప్రకటించారు. ఢిల్లీ పోలీసుల నిర్బంధం నుంచి విడుదలైన అనంతరం సీజేపీ సహ కన్వీనర్ ఆశుతోష్ రాంకా, మరో నేత సౌరవ్ దాస్ మీడియాతో మాట్లాడుతూ, తమ పోరాటం ఇప్పుడే మొదలైందని, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసేంత వరకు వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాల్లో అక్రమాలు జరిగాయని, ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియను దుర్వినియోగం చేస్తున్నారని సీజేపీ ఆరోపించింది. ప్రధాని మోదీ ప్రభుత్వం ఢిల్లీలో అత్యవసర పరిస్థితులను తలపించే వాతావరణాన్ని సృష్టించిందని దాస్ విమర్శించారుఎలాంటి అధికారిక నోటీసు లేకుండా



తమను నిర్బంధించారని, తమ ఫోన్లు స్వాధీనం చేసుకుని, న్యాయవాదిని సంప్రదించేందుకు అనుమతించలేదని ఆరోపించారు. తమ ఫోన్లను హ్యాక్ చేసి, వాటిలో పత్రాలు లేదా ఇతర సమాచారాన్ని చొప్పించి, తర్వాత వాటిని సాక్ష్యాలుగా చూపిస్తారేమోనని అనుమానంగా ఉందని దాస్ పేర్కొన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు మోదీ, అమిత్ షా ఎందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. 'గతంలో ఎమర్జెన్సీ గురించి విన్నాం. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాం. జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు మోదీ, షా ప్రయత్నిస్తున్నారు. ఆయన్ను కాపాడేందుకు దేశ ప్రజలతోనే యుద్ధం చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. 'శాంతి భద్రతలకు ఏడాది పాటు విఘాతం కలిగించకూడదని తమకు షరతు విధించారు. అయితే శాంతిభద్రతలకు విఘా తం కలిగిస్తున్నది నరేంద్ర మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్‌లేనని సీజేపీ నేతలు పేర్కొన్నారు. గత 72 గంటల్లో జరిగిన పరిణామాలు 1975–77 నాటి అత్యవసర పరిస్థితులను గుర్తుచేస్తున్నాయని రాంకా వ్యాఖ్యానించారు. ఈ పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలని, నిరసనల్లో పాల్గొనేందుకు వీధుల్లోకి రావాలని పిలుపునిచ్చారు. సోమవారం పార్లమెంట్ వీధి పోలీసులను కలిసి జంతర్ మంతర్‌లో శాంతియుత నిరసన తెలిపేందుకు ఒక తేదీని అనుమతించాలని కోరతా మన్నారు.

నమస్తే మహాప్రభ

జనరల్ న్యూస్

MAHAA PRABHA NEWS

PAGE NUMBER 03

సోమవారం 12-10-2026

WWW.MAHAAPRABHA.COM తెలుగు దినపత్రిక

విండీస్‌పై భారత్ విక్టరీ

సిరీస్‌లో 2-1తో ఆధిక్యం.. ఉప్పల్‌లో నాలుగో టీ20
-మూడో టీ20లో టీమిండియా 14 పరుగుల తేడాతో ఘన విజయం
-అభిషేక్ శర్మ విధ్వంసక ఇన్నింగ్స్.. 69 పరుగులతో మెరుపులు
-ఇషాన్ కిషన్ దూకుడు.. చివర్లో తిలక్, అక్షర్ కీలక పరుగులు
-223 పరుగులకు ఆలౌటైన భారత జట్టు
-209 పరుగులకే పరిమితమైన వెస్టిండీస్
-అర్షదీప్ సింగ్ మూడు వికెట్లతో సత్తా
-చివర్లో షమర్ స్ప్రింగర్ పోరాటం వృథా
-అక్టోబర్ 14న హైదరాబాద్‌లో నాలుగో టీ20




వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా అదరగొట్టింది. ఇండోర్ వేదికగా జరిగిన హైస్కోరింగ్ పోరులో 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2–1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. బ్యాటింగ్‌లో భారీ స్కోరు సాధించిన భారత జట్టు.. బౌలింగ్‌లోనూ కీలక సమయాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేసింది. ఈ సిరీస్‌లో నాలుగో టీ20 అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ భారీ స్కోరు సాధించింది. అభిషేక్ శర్మ (69) దూకుడైన ఆటతీరుతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇషాన్ కిషన్ (37) కూడా వేగంగా పరుగులు సాధించడంతో భారత జట్టు భారీ లక్ష్యం దిశగా దూసుకెళ్లింది. ఒక దశలో 250 పరుగుల మార్కును అందుకునేలా కనిపించిన టీమిండియా.. ఆ తర్వాత వరుస వికెట్లు కోల్పోయి తడబడింది. అయితే చివర్లో తిలక్ వర్మ (28), అక్షర్ పటేల్ (20) కీలక పరుగులు జోడించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. భారీ లక్ష్య ఛేదనకు దిగిన వెస్టిండీస్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. రెండో ఓవర్లోనే షై హోప్ ఐదు పరుగులు చేసి వెనుదిరిగాడు. అయినప్పటికీ విండీస్ బ్యాటర్లు దూకుడుగా ఆడుతూ లక్ష్యాన్ని అందుకునేందుకు ప్రయత్నించారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు తీయడంతో ప్రత్యర్థిపై ఒత్తిడి పెరిగింది. అర్షదీప్ సింగ్ మూడు వికెట్లు పడగొట్టి సత్తా చాటగా, నమన్ ధీర్ రెండు వికెట్లు తీశాడు. అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి చెరో వికెట్ సాధించారు. చివర్లో షమర్ స్ప్రింగర్ విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత శిబిరంలో కొంత ఉత్కంఠ రేపాడు. కేవలం 11 బంతుల్లోనే 35 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అయితే అప్పటికే లక్ష్యం దూరం కావడంతో వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 209 పరుగులకే పరిమితమైంది. దీంతో భారత్ 14 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. గత మ్యాచ్‌లో 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన వెస్టిండీస్.. ఈసారి భారత బౌలర్లను అధిగమించలేకపోయింది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2–1తో ముందంజలో నిలిచింది. సిరీస్‌ను కైవసం చేసుకోవాలంటే తదుపరి మ్యాచ్‌లోనూ భారత జట్టు ఇదే జోరు కొనసాగించాల్సి ఉంటుంది. మరోవైపు సిరీస్‌ను సమం చేయాలనే పట్టుదలతో వెస్టిండీస్ బరిలోకి దిగనుంది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20కి హైదరాబాద్‌లోని ఉప్పల్ క్రికెట్ స్టేడియం వేదిక కానుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

రష్యా--ఉక్రెయిన్ మధ్య సీజ్‌ఫైర్!



వాషింగ్టన్:
రష్యా--ఉక్రెయిన్ యుద్ధంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరు దేశాల మధ్య తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. రష్యా, ఉక్రెయిన్ ఇంధన రంగానికి సంబంధించిన దాడులను నిలిపివేసేందుకు అంగీకరించాయని తెలిపారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొంటూ, ఒప్పందాన్ని ఉల్లంఘించవద్దని ఇరు దేశాలకు సూచించారు. అయితే, ట్రంప్ ప్రకటనపై ఉక్రెయిన్ వర్గాలు స్పందిస్తూ.. కాల్పుల విరమణకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నాయి. దీంతో ఈ ప్రకటన అమలుపై సందిగ్ధత నెలకొంది. ఇరు దేశాల మధ్య నిజంగానే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందా? రష్యా, ఉక్రెయిన్ అధికారికంగా ఎలా స్పందిస్తాయి? అన్నది ఆసక్తికరంగా మారింది.

ఏఐ, అణు యుద్ధంతో 2100 నాటికి మానవాళి అంతం!



న్యూఢిల్లీ:
అణు యుద్ధం, కృత్రిమ మేధ(ఏఐ) దుర్వినియోగం వల్ల మానవాళి మనుగడ భవిష్యత్తులో ప్రమాదంలో పడొచ్చని లాన్సెట్ కొత్త నివేదిక హెచ్చరించింది. ఈ ప్రమాదాలు సంభవించే అవకాశం తక్కువగా ఉన్నప్పటికీ 2100 నాటికి వాటి వల్ల మానవాళి తుడిచి పెట్టుకుపోయే అవకాశం ఉందని తెలిపింది. మనుషుల ఆరోగ్యానికి రానున్న 75 ఏండ్లలో ప్రమాదకరంగా మారే 17 అంశాలను నివేదిక పేర్కొంది. వాటిలో ప్రధానంగా అణు యుద్ధం, ఏఐ దుర్వినియోగం, వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం, పిల్లల్లో పోషకాహార లోపం, ఊబకాయం, అంతర్జాతీయ సహాయంలో కోత వంటివి ఉన్నాయి.'ఆరోగ్యానికి 21వ శతాబ్దపు ప్రపంచ ప్రమాదాలపై లాన్సెట్ కమిషన్' పేరిట విడుదలైన నివేదికలో ఈ సమస్యలన్నీ ఒకదానికొకటి సంబంధం కలిగి ఉన్నాయని..ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రభుత్వాలు ఇప్పటికీ చర్యలు తీసుకొని భవిష్యత్తు తరాలను రక్షించవచ్చని నిపుణులు తెలిపారు. జీవాయుధాల సృష్టికి ఏఐని దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నదని.. ఈ ఆయుధాలు లక్షలాది మంది జీవితాలను ప్రమాదంలో పడేస్తాయని వారు హెచ్చరించారు. అణు యుద్ధం వల్ల పెద్ద సంఖ్యలో రేణువులు ఉపరితల వాతావరణంలోకి చేరతాయని..అవి సూర్య కాంతిని అడ్డుకొని ఆహారోత్పత్తిని ప్రభావితం చేస్తాయని తెలిపారు. ఇది కరువుకు దారి తీసి మానవాళి మనుగడకు ప్రమాదకరంగా మారొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక ఆల్కహాల్ సేవనం, అధిక రక్తపోటు, ఆదాయ అసమానతలు, తక్కువ విద్యా స్థాయిలు, మానసిక ఆరోగ్య క్షీణత, కూడా మానవాళి ఆరోగ్యానికి సవాళ్లు విసురుతాయన్నారు.

అట్టుడికిన హస్తిన

-ఢిల్లీలో వరుసగా రెండో రోజూ సీజేపీ ఆందోళనలు
-జ్ఞానేశ్ కుమార్ దిగిపోయే వరకు వెనక్కి తగ్గేది లేదు
రోడ్లపైనే ఉంటాం.. పోరాటం కొనసాగిస్తాం: అజింక్య శిండే
-జంతర్‌మంతర్ వెళ్లేందుకు యత్నించిన విద్యార్థుల అరెస్టు
-భారీగా పోలీసు, పారామిలిటరీ బలగాల మోహరింపు
-నిరసనకారులపై బలప్రయోగం చేశారని విద్యార్థి సంఘాల ఆరోపణ
-ముంబై శివాజీ పార్కులోనూ ఆందోళనకు పిలుపు
-నేడు మరోసారి నిరసనలకు ఇండియా కూటమి సన్నాహాలు
-సీజేపీ నేతలతో భేటీకి సమయం కోరిన రాహుల్ గాంధీ
-యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలి: రాహుల్



న్యూఢిల్లీ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో సీజేపీ నిరసనలు రెండో రోజూ కొనసాగాయి. జాతీయ రాజధానిలో పలుచోట్ల ఆందోళనలు జరగడంతో పోలీసులు, పారామిలిటరీ బలగాలను భారీగా మోహరించారు. నిరసనకారులను నియంత్రించేందుకు భద్రతను కట్టుదిట్టం చేశారు. గత రెండు రోజులుగా వేలాది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. దాదాపు 24 గంటల నిర్బంధం అనంతరం అభిజిత్ దీప్సే, అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్‌లను ఆదివారం ఉదయం విడుదల చేసినట్లు సమాచారం. సీజేపీ నాయకుడు అజింక్య శిండే మాట్లాడుతూ.. తమ డిమాండ్ నెరవేరే వరకు రోడ్లపైనే ఉండి పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. నాయకుల అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం భావిస్తోందని, అయితే తాము వెనక్కి తగ్గబోమని ప్రకటించారు. దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని అశుతోష్ రాంకా వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగుతాయని నాయకులు స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆందోళనల సందర్భంగా జంతర్‌మంతర్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, పలువురు విద్యార్థులను నిర్బంధించినట్లు సమాచారం. పోలీసుల దాడిలో తమ నాయకులు గాయపడ్డారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకుంటున్నారని సీజేపీ నాయకులు విమర్శించారు. ఢిల్లీలో అత్యవసర పరిస్థితిని తలపించేలా ఆంక్షలు విధించారని ఆరోపించారు. మెట్రో స్టేషన్ల మూసివేత, నిరసనకారులపై పోలీసుల బలప్రయోగం వంటి అంశాలపైనా సీజేపీ నాయకులు ప్రశ్నలు లేవనెత్తారు. తమ ఫోన్లను హ్యాక్ చేశారని లేదా పనిచేయకుండా చేశారని, సాక్ష్యాలను కావాలనే సృష్టించారనే అనుమానాలు ఉన్నాయని సౌరవ్ దాస్ పేర్కొన్నారు. సీఈసీ రాజీనామా చేసే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని, యువత శాంతియుతంగా నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మరోవైపు, నిరసనకారులు తిరిగి జంతర్‌మంతర్‌కు చేరుకునేందుకు ప్రయత్నిస్తారని అజింక్య శిండే ప్రకటించారు. అభిజిత్ దీప్సే, సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల అరెస్టులతో ఉద్యమం ఆగిపోతుందని ప్రభుత్వం భావించినా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఏఐఎస్ఎఫ్ అధ్యక్షురాలు నేహా బోరా కూడా సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా నిరసనలు కొనసాగుతాయని వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఢిల్లీలో మెట్రో, రైలు సేవలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. అన్ని మెట్రో స్టేషన్లను ఆదివారం తిరిగి తెరిచినట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ తెలిపింది. రైలు సేవలపై ఆంక్షలు శనివారం వరకే వర్తిస్తాయని నార్తర్న్ రైల్వే అధికారులు వెల్లడించారు. అయితే ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగాయి. ఆదివారం ఉదయం ఆరు గంటల నుంచి 30 ప్రాంతాల్లో వాహనాలను దారి మళ్లించారు. ఢిల్లీకి పరిమితం కాకుండా ఉద్యమాన్ని ఇతర ప్రాంతాలకూ విస్తరించాలని సీజేపీ నాయకులు భావిస్తున్నారు. ముంబైలోని శివాజీ పార్కులో నిరసన నిర్వహించేందుకు పిలుపునిచ్చారు. మరోవైపు, ఇండియా కూటమి నేతలు కూడా సోమవారం మరోసారి ఆందోళనలకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. సీజేపీ నాయకులతో సమావేశమయ్యేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమయం కోరినట్లు కథనం పేర్కొంది. యువత, ప్రతిపక్షాలు పాదయాత్రకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సీఈసీ రాజీనామా డిమాండ్‌తో కొనసాగుతున్న ఈ నిరసనలు రానున్న రోజుల్లో మరింత ఉధృతమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

నేపాల్‌లో మళ్లీ వరద బీభత్సం!

ఖాట్మండు
నేపాల్‌లో మరోసారి ప్రకృతి ప్రకోపం తీవ్ర ఆందోళనకు గురిచేసింది. గోర్ఖా జిల్లాలోని చుమ్నుబ్రి ప్రాంతంలో బుది గండకీ నది ఉప్పొంగడంతో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సంభవించిన ఈ విపత్తు ధాటికి పదుల సంఖ్యలో ఇళ్లు, పలు వంతెనలు కొట్టుకుపోయాయి. జలవిద్యుత్ కేంద్రం తీవ్రంగా దెబ్బతిన్నది. రెండు నెలల క్రితం ఎదురైన వరద విషాదం నుంచి తేరుకోకముందే మరోసారి వరదలు విరుచుకుపడటంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. నది ప్రవాహం అనూహ్యంగా పెరగడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆదివారం ఉదయం 3.66 మీటర్లుగా ఉన్న నీటిమట్టం కేవలం రెండు గంటల్లోనే 8.43 మీటర్లకు చేరింది. ప్రమాద సూచిక అయిన ఐదు మీటర్ల స్థాయిని దాటడంతో వరద తీవ్రత పెరిగింది. ఇసుక, బురదతో కూడిన వరద నీరు వేగంగా ప్రవహిస్తూ ఇళ్లు, వంతెనలను ధ్వంసం చేసింది. జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణ సంస్థ (ఎన్‌డీఆర్ఆర్ఎంఏ) ప్రాథమిక



సమాచారం ప్రకారం 34 ఇళ్లు దెబ్బతిన్నాయి. పలు వంతెనలు కొట్టుకుపోగా, జలవిద్యుత్ కేంద్రానికి భారీ నష్టం వాటిల్లింది. శాటిలైట్ చిత్రాలు, ప్రాథమిక సమాచారం ఆధారంగా బుది గండకీ నది ప్రవాహానికి ఏదో విధంగా ఆటంకం ఏర్పడి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. దీంతో నీరు ఒక్కసారిగా ఉప్పొంగి వరదలకు కారణమై ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే, అసలు కారణాలను నిర్ధారించేందుకు సాంకేతిక విశ్లేషణ అవసరమని స్పష్టం చేశారు. ప్రాథమిక సమాచారం ప్రకారం ఈ ఘటనలో ప్రాణనష్టం సంభవించలేదని అధికారులు తెలిపారు. మరోవైపు, వరద ప్రభావిత ప్రాంతాల్లో నేపాల్ సైన్యం సహాయక చర్యలను ప్రారంభించింది. అత్యవసర వైద్య బృందాన్ని రాజధాని నుంచి హెలికాప్టర్‌లో తరలించింది. బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు చేపట్టింది. నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని, పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. గత ఆగస్టులో టిబెట్ సరిహద్దు ప్రాంతంలో సంభవించిన వరదలు భారీ ప్రాణ, ఆస్తి నష్టాన్ని మిగిల్చినట్లు కథనం పేర్కొంది. ఆ విషాదం నుంచి కోలుకుంటున్న నేపాల్‌లో తాజాగా మరోసారి వరదలు సంభవించడం ఆందోళన కలిగిస్తోంది. పర్వత ప్రాంతాల్లో ఆకస్మికంగా పెరుగుతున్న నదీ ప్రవాహాలు, వరద ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోంది.

డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా గోవా

(మొదటి తరువాయి)

డ్రగ్స్ నియంత్రణలో బీజేపీ విఫలం
బీజేపీ పాలనలో గోవా డ్రగ్స్ కేంద్రంగా మారిందని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌కు సరఫరా అవుతున్న డ్రగ్స్ గోవా నుంచే వస్తున్నట్లు తెలంగాణ పోలీసులు గుర్తించారని పేర్కొన్నారు. దేశాన్ని మత్తు పదార్థాల రొంపిలోకి మారుస్తున్న చెబుతున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి గోవాలో డ్రగ్స్ సమస్యను ఎందుకు నియంత్రించలేకపోతున్నారని ప్రశ్నించారు. డ్రగ్స్ పెడ్లర్లు, భూకబ్జాదారుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను ఉద్దేశించి 'ప్రాపర్టీ సావంత్' అంటూ విమర్శించారు. రాష్ట్ర భూములు, ప్రభుత్వ ఆస్తులు ఇతరుల చేతుల్లోకి వెళున్నాయని ఆరోపించారు. గోవా ప్రజలు మరోసారి బీజేపీని నమ్మి మోసపోవద్దని, ఆ పార్టీని ఓడించేందుకు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు.
ఓట్ల జాబితాలపై ఆరోపణలు
దేశవ్యాప్తంగా ఓట్ల జాబితాల నుంచి పేదలు, దళితులు, మైనార్టీలు, ఆదివాసీల ఓట్లను తొలగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఎన్నికల బ్యబస్థను ఉపయోగించుకుని ప్రతిపక్షాల ఓటు బలాన్ని తగ్గించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరాటాన్ని రాముడు, రావణుడి యుద్ధంతో పోల్చిన ఆయన.. దేశంలో ఐక్యత, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పోరాడుతోందని పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర లక్ష్యం ప్రజలను ఏకం చేయడమేనని చెప్పారు.
2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం: సీఎం
2027లో గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గోవా ప్రజల భూములు, హక్కులు, యువత భవిష్యత్తును కాపాడేందుకు కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని కోరారు. డ్రగ్స్ సమస్యను నియంత్రించి, భూకబ్జాలను అరికట్టి మెరుగైన పాలన అందించాలంటే బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు.
'గోయ్ రాథోన్స్' యాత్రలో పాల్గొన్న రేవంత్
గోవా కాంగ్రెస్ నిర్వహిస్తున్న 'గోయ్ రాథోన్స్' యాత్రలోనూ ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పనాజీలోని చీఫ్స్ స్మారకం నుంచి కున్సేలిమ్ బస్టాండ్ వరకు నిర్వహించిన పాదయాత్రలో ఆయన పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు. గోవా భూములు, సహజ వనరులు, ప్రజల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఈ యాత్ర చేపట్టినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీకి మద్దతు కూడగట్టడంపై నాయకత్వం దృష్టి సారించింది.

సిద్ధిపేట గడ్డ నుంచే మళ్లీ ఉద్యమం!

1983లోనే సిద్ధిపేటను జిల్లాగా ఏర్పాటు చేయాలని అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు దరఖాస్తు ఇచ్చినట్లు గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2016 అక్టోబర్ 11న జిల్లా ఏర్పాటైందన్నారు. గతంలో విద్యుత్ కనెక్షన్లు, ఇతర ప్రభుత్వ పనుల కోసం రైతులు సంగారెడ్డికి వెళ్లాల్సి వచ్చేదని, జిల్లా ఏర్పాటు తర్వాత ఆ ఇబ్బందులు తగ్గాయని పేర్కొన్నారు. అనంతగిరి, గౌరవెల్లి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టులతో సాగునీటి సదుపాయాలు మెరుగుపడ్డాయని తెలిపారు. 24 గంటల విద్యుత్, తాగునీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ, వైద్య కళాశాల, ఐటీ టవర్ వంటి సదుపాయాలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అందుబాటులోకి వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో చేపట్టిన అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లకుండా నిలిపివేస్తోందని విమర్శించారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీరు ఉన్నప్పటికీ కాళేశ్వరం, కల్వకుర్తి, దేవాదుల ప్రాజెక్టుల మోటార్లను పూర్తిస్థాయిలో నడపడం లేదని హరీశ్‌రావు ఆరోపించారు. రంగనాయక సాగర్‌ను పూర్తిగా నింపకపోవడంతో సిద్ధిపేట, దుబ్బాక, గజ్వేల్ ప్రాంతాల్లో పంటలకు నీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. దేవాదుల మోటార్లను ఎనిమిది గంటలే నడుపుతున్నారని, కల్వకుర్తి ప్రాజెక్టు వద్ద కూడా ఇదే పరిస్థితి ఉందని పేర్కొన్నారు. బొగ్గు నిల్వలు, విద్యుత్ ఉత్పత్తి నిర్వహణలో ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ పరిస్థితికి కారణమని ఆరోపిస్తూ రైతులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు

సిరిసిల్ల జేఎన్‌టీయూ సమస్యలను పరిష్కరించండి!

(మొదటి తరువాయి)

తెలిపారు. అయినప్పటికీ నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో కళాశాల అగ్రహారంలోని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తాత్కాలికంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. ప్రస్తుతం కళాశాల కొనసాగుతున్న ప్రాంగణం నుంచి మరో ప్రైవేటు భవనానికి తరలించే ప్రతిపాదనలు విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అందుబాటులో ఉన్న తరగతి గదులు, ప్రయోగశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు నిరుపయోగంగా మారకుండా చూడాలని సూచించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి అంతరాయం కలిగించే నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. మండేపల్లిలో కేటాయించిన స్థలంలో శాశ్వత క్యాంపస్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి పనులను వేగవంతం చేయాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కొత్త క్యాంపస్ నిర్మాణం పూర్తయ్యే వరకు కళాశాలను ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాంగణంలోనే నిర్వహించేందుకు అనుమతించాలని కోరారు. తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు ప్రస్తుత ప్రాంగణాన్ని ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయకుండా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించడంలో ఈ కళాశాల కీలక పాత్ర పోషిస్తున్నదని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని క్యాంపస్ నిర్మాణాన్ని వేగవంతం చేయడంతోపాటు, ప్రస్తుత ప్రాంగణంలోనే కళాశాల కొనసాగించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు

రైతులు రెండో పంటతో నష్టపోవద్దు

(మొదటి తరువాయి)

శంకుస్థాపన చేశారు. మంగలితండాలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. అలాగే.. హటియాథాండాలో ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బడ?త్ వీరన్న తండ్రి భాషా కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాల శ్రీకార సభలో మంత్రి ప్రసంగించారు. గతంలో యూనిట్ విద్యుత్తు రూ. 7, రూ. 8కు లభించడాని, ప్రస్తుతం విద్యుత్తు కొరత తీవ్రంగా ఉందని మంత్రి పొంగులేటి ఆవేదన వ్యక్తం చేశారు. యూనిట్‌కు రూ. 15 చెల్లించి కొనుగోలు చేసాలన్నా దేశంలో విద్యుత్తు లభించని పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. భూగర్భ జలమట్టాలు క్రమంగా పడిపోతున్న నేపథ్యంలో భవిష్యత్తులో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ఇప్పటి నుంచే పదిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
రెండో పంట సాగు వద్దు..
ఎల్నినో ప్రభావం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో రైతులు రెండో పంట సాగు చేయవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే వేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. రెండో పంట వేసి, నీరు అందక పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని, ప్రభుత్వ సూచనలను పాటించాలని కోరారు. ఎల్నినో ప్రభావం దక్షిణ ప్రాంతాలపై తీవ్రంగా ఉందని పొంగులేటి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర మంత్రివర్గ బృందం ఢిల్లీ వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలిసి తెలంగాణలో నెలకొన్న పరిస్థితులను వివరించనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి అధిక ఆర్థిక సహాయం అందించేలా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని, జీ రామ్ జీ పథకం కింద గ్రామాల్లో అదనపు పనిదినాలు కల్పించాలని కేంద్రాన్ని అభ్యర్థించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దివాకర.టీఎస్, కాంగ్రెస్ మండలధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ. హఫీజ్‌ద్దీన్, జాకూరి గోపాలరావు, పలువురు సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ముదిరాజులకు ప్రాధాన్యం ఇవ్వాలి

-రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం వీడాలి..

- డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ డిమాండ్



ఎల్లారెడ్డి, అక్టోబర్ 11, (మహాప్రభ):

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి నామినేటెడ్ పదవుల్లో తగిన ప్రాధాన్యం కల్పించాలని ముదిరాజ్ మహాసభ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ముదిరాజ్ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు దుద్దుల సాయిరాం అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంతో పాటు కామారెడ్డి జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ముదిరాజులకు మండల, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులు కల్పించడంలో రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆయన ఆరోపించారు. అధిక జనాభా ఉన్న ఈ సామాజిక వర్గానికి సొసైటీ చైర్మన్లు, మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు వంటి పదవుల్లో అవకాశాలు కల్పించాలని కోరారు. ముదిరాజులను రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నాలను సహించబోమని, పార్టీల వైఖరిలో మార్పు రాకపోతే రాబోయే రోజుల్లో తమ రాజకీయ బలాన్ని చూపిస్తామని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు చొరవ తీసుకుని ముదిరాజులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ సొసైటీ చైర్మన్ ఎగుల నర్సింహులు, జక్కుల సంతోష్‌కుమార్, మర్రి బాలకిషన్, మర్రి ప్రకాష్, గంట సాయిలు, భాస్కర్, ప్రవీణ్, క్యాస కిష్టయ్య, కన్నెబోయిన రాజు, గొనె మహేందర్, జక్కుల అశోక్, పరంధాములు, సాయిలు, నీల రవి తదితరులు పాల్గొన్నారు.

కోదండ రాముడిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి.



మెదక్ జిల్లా -11అక్టోబర్ (మహాప్రభ).

మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెను ఆశీర్వదించి సన్మానించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన ఫంక్షన్ హాల్లో సీనియర్ జర్నలిస్టు నాగరాజ్ శర్మ కుమార్తె సారె కార్యక్రమానికి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, రామాలయ కమిటీ అధ్యక్షుడు బండ నరేందర్, మాజీ కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్, నాయకులు లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నిక కాబడిన స్వర్ణకారుల సంఘం ఘన సన్మానం



దేవరకొండ అక్టోబర్ 11(మహాప్రభ)

దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనముగా ఎన్నికకాబడిన స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు కాసుల వెంకటాచారి, శ్రీనివాస్ చారి, కోశాధికారి కూరెళ్ళ కృష్ణ చారి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సరిగడ్ల విఠలాచారి, గౌరవ అధ్యక్షులు జగన్ చారి మరియు మొత్తం కార్యవర్గాన్ని సన్మానించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి, ఉపాధ్యక్షులు, కార్యవర్గాన్ని సన్మానించడం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ స్వర్ణకారులు రాజకీయంగా,సామాజికంగా, ఆర్థికంగా ముందు స్థాయిలో ఉండాలని స్వర్ణకారుల వృత్తి అనేది చాలా ప్రాముఖ్యమైన వృత్తిఅని అందరూ కలిసికట్టుగా ఉండి స్వర్ణకారుల సమస్యలపై ఐక్యపోదాటం చేయాలని కోరారు. స్వర్ణకారుల సమస్యలపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం మద్దతు ఎప్పుడు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భాషా చవాన్, శ్రీనివాస చారి, భీష్మాచారి, స్వర్ణకారుల సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా మాత కు స్వాగతం



పాపన్నపేట,అక్టోబర్ 11(మహా ప్రభ)

సంస్థాన్ పాపన్నపేటలో దేవిశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. యువసేన యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని దుర్గమ్మ గుడి వరకు ఊరేగింపు చేపట్టారు. కళాకారుల నృత్యాలతో అమ్మవారికీ ఘన స్వాగతం పలికారు. అనంతరం నీలాగైనీ సమీప మండపంలో మాతను ప్రతిష్టించారు. అర్చకులు అమ్మవారి కీ విశేష పూజలు చేపట్టారు. గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం సామాన్య ప్రజలకు వజ్రాయుధం

దేవరకొండ అక్టోబర్ 11 (మహాప్రభ)

అవినీతి నిర్మూలనకు ఆర్టీఐ బ్రహ్మాస్త్రం -- ప్రభుత్వ పాలనలో పారదర్శకతకు ప్రజల చేతిలో శక్తిమంతమైన ఆయుధం ఆర్టీఐ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలి -- ఆర్టీఐ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్

అక్టోబర్ 12 నుంచి 19 వరకు సమాచార హక్కు చట్టం వారోత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలిరాష్ట్రంలో ప్రతి జిల్లాలో ఆర్టీఐ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి -- కమిటీల్లో ఇద్దరు ఆర్టీఐ కార్యకర్తలకు ప్రాతినిధ్యం కల్పించాలిప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారుల వివరాలతో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలిప్రభుత్వ అధికారులకు ప్రతి మూడు నెలలకోసారి ఆర్టీఐ చట్టంపై శిక్షణ ఇవ్వాలి

సమాచారం అనేది అధికారుల దయ కాదు -- ప్రజల రాజ్యాంగబద్ధమైన హక్కు

సమాచార హక్కు చట్టం--2005 సామాన్య ప్రజల చేతిలో వజ్రాయుధమని, అవినీతి నిర్మూలనకు, ప్రభుత్వ పాలనలో పారదర్శకత సాధనకు, అధికార యంత్రాంగంలో జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు ఈ చట్టం అత్యంత శక్తిమంతమైన సాధనమని రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్టివిస్ట్ సొసైటీ (RTIAS) రాష్ట్ర అధ్యక్షులు డా. కొర్ర కిషన్ నాయక్ పేర్కొన్నారు.

సమాచారం అనేది ప్రభుత్వ అధికారుల వ్యక్తిగత ఆస్తి కాదని, ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని చట్టబద్ధంగా తెలుసుకునే హక్కు ప్రతి భారతీయ పౌరుడికి ఉందని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు, ప్రభుత్వ నిర్ణయాలు, అధికారుల విధులు, బాధ్యతలు తదితర అంశాలపై ప్రజలు సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

అక్టోబర్ 12 నుంచి 19 వరకు ఆర్టీఐ వారోత్సవాలు నిర్వహించాలి సమాచార హక్కు చట్టం 2005 అక్టోబర్ 12న అమల్లోకి వచ్చిన సందర్భంగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 12 నుంచి 19 వరకు రాష్ట్రవ్యాప్తంగా సమాచార హక్కు చట్టం అవగాహన వారోత్సవాలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డా. కొర్ర కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ విభాగాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ప్రజలతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులకు సమాచార హక్కు చట్టంలోని నిబంధనలు, దరఖాస్తు విధానం, అప్పీళ్ల ప్రక్రియ, సమాచార కమిషన్ల అధికారాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆర్టీఐ సూచిక బోర్డులు తప్పనిసరిసమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 4(1)(బి), సెక్షన్ 5 నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన కోరారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పౌర సమాచార అధికారి (PIO), సహాయక పౌర సమాచార అధికారి (APIO), మొదటి అప్పీలేట్ అధికారి పేర్లు, హోదాలు, కార్యాలయ చిరునామాలు, అందుబాటులో ఉన్న సంప్రదింపు వివరాలను ప్రజలకు స్పష్టంగా కనిపించే ప్రదేశంలో ప్రదర్శించాలని డిమాండ్ చేశారు.

అధికారుల బదిలీలు, పదోన్నతులు, నియామకాల కారణంగా వివరాల్లో మార్పులు జరిగినప్పుడు వాటిని ఎప్పటికప్పుడు సవరించాలని సూచించారు.

సెక్షన్ 4(1)(బి) ప్రకారం 17 అంశాల సమాచారాన్ని వెల్లడించాలి

సమాచార హక్కు చట్టం సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రభుత్వ సంస్థలు తమ సంస్థాగత నిర్మాణం, అధికారుల విధులు, నిర్ణయ ప్రక్రియ, నిబంధనలు, బడ్జెట్ కేటాయింపులు, సబ్సిడీలు, ప్రజలకు అందించే సేవలు తదితర 17 అంశాలకు సంబంధించిన సమాచారాన్ని స్వచ్ఛందంగా వెల్లడించాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రజలు ప్రతి చిన్న సమాచారం కోసం ఆర్టీఐ దరఖాస్తులు చేసుకోవాల్సిన పరిస్థితి రాకుండా ప్రభుత్వ శాఖలు ముందుగానే సమాచారాన్ని బహిర్గతం చేయాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత పెరిగితే అవినీతికి అవకాశాలు తగ్గుతాయని, ప్రజలకు ప్రభుత్వ వ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.



డా,, కొర్ర. కిషన్ నాయక్
RTIAS రాష్ట్ర అధ్యక్షులు
ఫోన్ నెం 9885122005

సమాచార హక్కు చట్టంలోని ముఖ్యమైన సెక్షన్లు

సెక్షన్ 6(1): భారతీయ పౌరులు సంబంధిత ప్రజా సమాచార అధికారికి దరఖాస్తు సమర్పించి సమాచారం కోరవచ్చు.

సెక్షన్ 6(3): కోరిన సమాచారం మరో ప్రజా అధికార సంస్థ పరిధిలో ఉంటే, చట్టంలో పేర్కొన్న విధంగా దరఖాస్తును సంబంధిత సంస్థకు బదిలీ చేయాలి.

సెక్షన్ 7(1): సాధారణంగా సమాచారాన్ని 30 రోజుల్లో అందించాలి. వ్యక్తి ప్రాణం లేదా స్వేచ్ఛకు సంబంధించిన సమాచారం అయితే 48 గంటల్లో అందించాలి.

సెక్షన్ 7(6): చట్టబద్ధమైన గడువులోపు సమాచారం అందించకపోతే సంబంధిత సమాచారాన్ని ఉచితంగా అందించాలి.

సెక్షన్ 8(1): జాతీయ భద్రత, కొన్ని రకాల వ్యక్తిగత సమాచారం, ఇతర చట్టబద్ధ మినహాయింపులకు సంబంధించిన నిబంధనలు వర్తిస్తాయి.

సెక్షన్ 8(2): మినహాయింపు పరిధిలో ఉన్న సమాచారాన్ని కూడా వెల్లడించడం వల్ల కలిగే ప్రజాప్రయోజనం, రక్షిత ప్రయోజనాలకు కలిగే హానికంటే అధికంగా ఉన్నప్పుడు వెల్లడించడానికి అవకాశం ఉంటుంది.

సెక్షన్ 18(1): చట్టంలో పేర్కొన్న పరిస్థితుల్లో కేంద్ర లేదా రాష్ట్ర సమాచార కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

సెక్షన్ 18(3): ఫిర్యాదుల విచారణలో సమాచార కమిషన్లకు కొన్ని సివిల్ కోర్టు అధికారాలు ఉంటాయి.

సెక్షన్ 19(1): సమాచారం అందకపోయినా, తీసుకున్న నిర్ణయంపై అసంతృప్తి ఉన్నా, నిర్ణీత గడువులో మొదటి అప్పీల్ దాఖలు చేయవచ్చు.

సెక్షన్ 19(3): మొదటి అప్పీల్ నిర్ణయంపై అసంతృప్తి ఉన్నప్పుడు సంబంధిత సమాచార కమిషన్‌కు సాధారణంగా 90 రోజుల్లో రెండవ అప్పీల్ చేసుకోవచ్చు. తగిన కారణాలుంటే ఆలస్యాన్ని కమిషన్ మన్నించవచ్చు.

సెక్షన్ 19(8)(బి): చట్టం ప్రకారం తగిన సందర్భాల్లో ఫిర్యాదుదారుకు లేదా దరఖాస్తుదారుకు కలిగిన నష్టం లేదా ఇతర ఇబ్బందులకు పరిహారం చెల్లించాలని సంబంధిత ప్రజా అధికార సంస్థను సమాచార కమిషన్ ఆదేశించవచ్చు.

సెక్షన్ 20(1): సరైన కారణం లేకుండా సమాచారం ఇవ్వడానికి నిరాకరించినా, ఉద్దేశపూర్వకంగా తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం అందించినా, ఇతర నిర్దేశిత ఉల్లంఘనలకు పాల్పడినా, సంబంధిత పౌర సమాచార అధికారిపై రోజుకు రూ.250 చొప్పున గరిష్ఠంగా రూ.25,000 వరకు జరిమానా విధించే అధికారం సమాచార కమిషన్‌కు ఉంది.

ప్రతి జిల్లాలో ఆర్టీఐ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సమాచార హక్కు చట్టం అమలు తీరును పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా జిల్లా ఆర్టీఐ కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని డా. కొర్ర కిషన్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కమిటీల్లో కనీసం ఇద్దరు ఆర్టీఐ కార్యకర్తలను సభ్యులుగా నియమించి ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పించాలని సూచించారు.

జిల్లాస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు సమాచార హక్కు చట్టాన్ని ఎంతవరకు అమలు చేస్తున్నాయి, ప్రజలకు నిర్ణీత గడువులో సమాచారం అందిస్తున్నాయా, సెక్షన్ 4(1)(బి) నిబంధనలను పాటిస్తున్నాయా అనే అంశాలను సమీక్షించే విధంగా కమిటీలను ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రతి మూడు నెలలకోసారి ప్రభుత్వ అధికారులకు శిక్షణ

గ్రామపంచాయతీ కార్యదర్శుల నుంచి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల వరకు అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ప్రతి మూడు నెలలకోసారి సమాచార హక్కు చట్టంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ముఖ్యంగా పౌర సమాచార అధికారులు, సహాయక పౌర సమాచార అధికారులు, అప్పీలేట్ అధికారులకు చట్టంలోని నిబంధనలు, సమాచార మినహాయింపులు, గడువులు, అప్పీళ్ల విధానం, సమాచార కమిషన్ల ఆదేశాల అమలుపై సమగ్ర అవగాహన కల్పించాలన్నారు.

'హమారా పైసా -- హమారా హిసాబ్' స్ఫూర్తితో ప్రజలు ముందుకు రావాలి

భారతదేశంలో సమాచార హక్కు ఉద్యమానికి ప్రజా ఉద్యమాలు బలమైన పునాది వేశాయని ఆయన పేర్కొన్నారు.

మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (వీఖూా) ఉద్యమంలో వినిపించిన 'హమారా పైసా -- హమారా హిసాబ్' (మా డబ్బు -- మా లెక్క) అనే నినాదం ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనానికి ప్రతీకగా నిలిచిందన్నారు.

ప్రజల పన్నుల ద్వారా ప్రభుత్వానికి సమకూరుతున్న నిధులు ఎలా ఖర్చవుతున్నాయో తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని తెలిపారు.

ప్రభుత్వ పథకాల అమలు, గ్రామపంచాయతీ నిధులు, అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణం, ప్రభుత్వ కొనుగోళ్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాల్లో చట్టబద్ధంగా అందుబాటులో ఉన్న సమాచారాన్ని ప్రజలు కోరవచ్చని వివరించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీఐ అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలి

సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 21 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం అమలు తీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని డా. కొర్ర కిషన్ నాయక్ కోరారు.

సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార వెల్లడింపు వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఆర్టీఐ కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు, సమాచార దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం, అధికారుల నిర్లక్ష్యం వంటి అంశాలను ప్రభుత్వం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ పాలన ప్రజలకు జవాబుదారీగా ఉండాలంటే సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత అవసరమని స్పష్టం చేశారు.

సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం

"సమాచారం అనేది అధికారం కాదు -- ప్రజల హక్కు. చీకటిని చీల్చే వెలుగు సమాచార హక్కు చట్టం. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో పౌరుడి హక్కు. చట్టబద్ధంగా కోరిన సమాచారాన్ని అందించడం సంబంధిత అధికారుల బాధ్యత. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి."

అని డా. కొర్ర కిషన్ నాయక్ పిలుపునిచ్చారు.

సమాచార హక్కు చట్టాన్ని కేవలం దరఖాస్తులు చేసుకునే సాధనంగా కాకుండా ప్రజాస్వామ్య పరిరక్షణకు, ప్రభుత్వ పాలనలో పారదర్శకత సాధనకు, అవినీతి నిర్మూలనకు ఉపయోగించుకోవాలని ప్రజలకు సూచించారు

త్యాగరాయ గానసభలో 'కంఠాంజలి' కథా సంకలనం ఆవిష్కరణ

- డాక్టర్ చిలుక భాస్కర్‌ను ఘనంగా సత్కరించిన భవాని సాహితీ వేదిక

: హైదరాబాద్, అక్టోబర్ 11 మహాప్రభ

హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో ఆదివారం 'కంఠాంజలి' కథా సంకలన పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణ ముఖ్య అతిథిగా పాల్గొని తన చేతుల మీదుగా కథా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కథా రచయిత డాక్టర్ చిలుక భాస్కర్‌ను డాక్టర్ దాసరి వెంకటరమణ అభినందించి, ఆయన సాహితీ సేవలను ప్రశంసించారు. అనంతరం భవాని సాహితీ వేదిక



ఆధ్వర్యంలో డాక్టర్ చిలుక భాస్కర్‌కు ప్రశంసాపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ మేరకు డాక్టర్ చిలుక భాస్కర్ మాట్లాడుతూ.. కథా రచన ద్వారా సమాజంలోని వివిధ అంశాలను, మానవ సంబంధాలను, జీవిత అనుభవాలను పాఠకులకు చేరువ చేయవచ్చని పేర్కొన్నారు. సాహిత్యం సమాజంలో చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు మానవీయ విలువలను ప్రతిబింబిస్తుందని తెలిపారు. తన రచనలను గుర్తించి, ప్రోత్సహించి, సత్కరించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి వెంకటరమణకు, భవాని సాహితీ వేదిక నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాంస్కృతిక కళాసేవకులు వంశీ రామరాజు, ఘంటారావం మనోహారెడ్డి, డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు, వైగారాగ్యం ప్రభాకర్‌తో పాటు పలువురు కవులు, కళాకారులు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో ఇళ్ల భద్రతపై
అప్రమత్తంగా ఉండాలి.

-ఖాళీ ఇళ్లలో చోరీలు జరగకుండా ప్రత్యేక పోలీస్ గస్తీ.
-ఇళ్ల భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి
-మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్.



మెదక్ జిల్లా -11అక్టోబర్ (మహాప్రభ).
దసరా పండుగ సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ స్వగ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లే సమయంలో ఖాళీగా ఉండే ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ జిల్లా వ్యాప్తంగా పోలీస్ గస్తీని ముమ్మరం చేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, దసరా పండుగను దృష్టిలో ఉంచుకొని జిల్లా వ్యాప్తంగా నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లే ముందు తలుపులు, కిటికీలకు పటిష్టమైన తాళాలు వేయాలని, వెనుక తలుపులు, బాల్కనీలను కూడా తనిఖీ చేసుకోవాలని సూచించారు. బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని కోరారు. ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లే విషయాన్ని నమ్మకమైన పొరుగువారికి తెలియజేయడంతో పాటు, ఎక్కువ రోజుల పాటు ఇంట్లో ఎవరూ ఉండని సందర్భంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.ఇంటి వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలు, భద్రతా అలారం వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ముందుగానే తనిఖీ చేసుకోవాలని తెలిపారు. ప్రయాణ వివరాలు, ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా వెల్లడించవద్దని సూచించారు. ఇంటి తాళాలను బయట కనిపించే ప్రదేశాల్లో ఉంచకూడదని స్పష్టం చేశారు. ఇంటి నుంచి బయలుదేరే ముందు అవసరం లేని విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయాలని, గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను మూసివేయాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను సురక్షితమైన ప్రదేశాల్లో పార్క్ చేసి, హ్యాండిల్ లాక్‌తో పాటు ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని తెలిపారు.
దసరా సెలవుల సమయంలో ఇళ్లలో చోరీలు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు, చైన్ స్నాచింగ్ వంటి నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ అప్రమత్తంగా ఉంటుందని ఎస్పీ తెలిపారు. పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాల కదలికలు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ సహాయం కోసం డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు. దసరా పండుగ సెలవులను ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ నేరాల నివారణలో పోలీసులకు సహకరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు.

బాలత్రిపుర సుందరి
దేవిగా వనదుర్గమ్మ

-ఏడుపాయల్లో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
-అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అడిషనల్ కలెక్టర్ నగేష్,ఈఓ మఠం వీరేశం



పాపన్నపేట, అక్టోబర్ 11 :(మహాప్రభ)
తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వన దుర్గ మాత క్షేత్రంలో విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కళకళలాడాయి. ఈసందర్భంగా మాత ఉత్సవ విగ్రహాన్ని ప్రధాన ఆలయం నుంచి గోకుల్ షెడ్ వరకు భాజభజంత్రీల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేక మంటపంలో ప్రతిష్టించారు. అనంతరం నవరాత్రుల ప్రధాన అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి రోజు వన దుర్గ మాత బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో మెదక్ అడిషనల్ కలెక్టర్ నగేష్,ఆలయ ఈఓ మఠం వీరేశం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నవరాత్రుల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలు ఏడుపాయలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తులకు అన్న ప్రసాదం ,పోలీసుల బందోబస్తు
నవరాత్రి ఉత్సవాలకు విచ్చేసిన భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో ఉన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,మాజీ ఎంపీపీ చందన ప్రశాంత్ రెడ్డి,మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి మల్లప్ప, నాయకులు ముశెట్టి కిష్టయ్య, ఆలయ సిబ్బంది .. సూర్య శ్రీనివాస్,మధుసూదన్ రెడ్డి,ప్రతాప్ రెడ్డి,సాయిబాబా,నరేష్, మహేష్,యాదగిరి,దీపక్ రెడ్డి,బలరాం తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్రలో పశువుల దొంగల ముఠా గుట్టురట్టు..
టాటా ఏస్ వాహనంలో గేదెల తరలింపు

-ఏడుగురు నిందితుల అరెస్ట్
-రూ.2.50 లక్షల విలువైన మూగజీవాలు, వాహనం స్వాధీనం.. పరారీలో మరో ముగ్గురు



దేవరకద్ర, నియోజకవర్గం అక్టోబర్ 11మహాప్రభ
మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో సంచలనం సృష్టించిన పశువుల చోరీ కేసుకు సంబంధించి స్థానిక పోలీసులు పక్కా సమాచారంతో రంగంలోకి దిగి భారీ ముఠా గుట్టు రట్టు చేశారు. తెల్లవారుజామున నిద్రమత్తులో ఉన్న రైతులను టార్గెట్ చేస్తూ, క్షణాల్లో గేదెలను మాయం చేస్తున్న అంతర్రాష్ట్ర/స్థానిక దొంగల ముఠా ఆట కట్టించారు. ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2.50 లక్షల విలువైన రెండు గేదెలు, నేరానికి ఉపయోగించిన టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.
అసలేం జరిగిందంటే..?
దేవరకద్ర పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్నరాజమూరు గ్రామ శివారులో ఈనెల 7వ తేదీ తెల్లవారుజామున రైతు వన్నాడ రాజుకు చెందిన రెండు గేదెలు అదృశ్యమయ్యాయి. రోజువారీ కష్టంతో బతికే పేద రైతు తన జీవాలను కోల్పోవడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై భాస్కర్ రెడ్డి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.
వాహన తనిఖీల్లో దొరికిపోయిన వైనం:
ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు శుక్రవారం (అక్టోబర్ 10న) చౌదర్‌పల్లి గేట్ **సమీపంలో వాహనాల తనిఖీలు** నిర్వహిస్తుండగా.. అటుగా వస్తున్న ఒక టాటా ఏస్ వాహనంపై అనుమానం వచ్చి తనిఖీ చేశారు. అందులో దొంగిలించిన రెండు గేదెలు ఉండటంతో పోలీసులు అవాక్కయ్యారు. వెంటనే అప్రమత్తమై వాహనంలో ఉన్న ఏడుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.
అరెస్ట్ అయిన నిందితులు వీరే:
పోలీసుల అదుపులో ఉన్న నిందితులు మహమ్మద్ ఇలియాజ్ ఖురేషి, కామరపు నరేష్, కొండ్ర అరవింద్, పులిమడి శంకర్ అలియాస్ శివ, కొండ్ర కార్తిక్, నిమ్మోజి అక్షయ్ చారి, బోయ మధు అలియాస్ మధుసూదన్ నాయుడులుగా గుర్తించారు.
పరారీలో మరో ముగ్గురు.. గాలింపు తీవ్రం:
ఈ ఘరానా చోరీలో ప్రధాన పాత్ర పోషించి, పరారీలో ఉన్నట్లు అనుమానిస్తున్న హరిజన్ శివ, అస్లాం, జిక్రియా లు త్వరలోనే మా అదుపులోకి వస్తారని రిమాండ్ రిపోర్టులో పోలీసులు స్పష్టం చేశారు. వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. రాత్రి సమయాల్లో పశువుల కాపలాపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై భాస్కర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలించి, కేసు దర్యాప్తును మరింత వేగవంతం చేశామని తెలిపారు.

విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్ని హోత్రం



పాపన్నపేట, అక్టోబర్ 11 (మహాప్రభ)
పర్యావరణ శుద్ధికరణ సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో విశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అగ్నిమూత్ర సామూహిక కార్యక్రమాన్ని నిర్వహించారు. తిరుగుతున్న కాలుష్యం మానసిక ఒత్తిడి ఉన్న ఈ కాలంలో ప్రాచీన వేద విజ్ఞానమైన అగ్నిహోత్రంను పున:పరిచయం ఈ యొక్క కార్యక్రమం ఉద్దేశం. సూర్యోదయ సూర్యాస్తమయ సమయాల్లో కేవలం పది నిమిషాల పాటు నిర్వహించే ఈ ప్రక్రియ విష తుల్యాలను తొలగించి ఒత్తిడిని తగ్గిస్తుందని శాస్త్రీయంగా నిరూపించ బడింది. రాగి పిరమిడ్,ఎండిన ఆవు పేడ బిల్లలు,స్వచ్ఛమైన నెయ్యి అక్షింతలను ఉపయోగించి అగ్నిహోత్రాన్ని నిర్వహించే సరైన పద్ధతిని నిపుణులు ప్రత్యక్షంగా చూపిస్తారు. సామూహిక అగ్నిహోత్రం ఖచ్చితమైన సమయంలో అందరూ కలిసి ఒకేసారి అగ్నిహోత్రం నిర్వహించి శక్తివంతమైన సామూహిక స్వస్థత శక్తిని సృష్టిస్తారు. శాస్త్రీయ విశ్లేషణ సేంద్రీయ వ్యవసాయం,నీటి వనరుల శుద్ధికరణ మానవ రోగ నిరోధక శక్తిని పెంచడంలో అగ్నిహోత్రం ఎలా సహాయపడుతుందని అంశంపై ప్రసంగంతో తెలియజేశారు. అగ్నిహోత్రం అనేది కేవలం ఒక సాంప్రదాయం మాత్రమే కాదు,ఇది పర్యావరణం మానసిక శాంతి కోసం వేద కాలపు మహర్షులు మానవాళికి అందించిన వరం కాలుష్య ప్రభావం నుండి మన భావితరాలను రక్షించే ప్రతి ఇంటికి అవగాహన కల్పించడమే అగ్ని మూత్ర యొక్క ముఖ్య లక్ష్యం అని విశ్వ ఫౌండేషన్ శిక్షణ సమన్వయకర్త విశ్వ ఫౌండేషన్ ధర్మ సైనికులు వివరించారు.

బాలా త్రిపురసుందరీ దేవిగా కొలువైన అమ్మవారు..







- వెంకటాయపల్లిలో భక్తిశ్రద్ధలతో నవరాత్రుల ప్రారంభం

దేవరకద్ర, నియోజకవర్గం అక్టోబర్ 11 మహాప్రభ
మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం వెంకటాయపల్లి గ్రామంలో దేవీ శరన్నవరాత్ర వేడుకలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మొదటి రోజు శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయ ఆవరణతో పాటు శ్రీ రంగనాయక స్వామి కాలనీలో అమ్మవారు ప్రథమ అలంకారమైన బాల త్రిపురసుందరి దేవి రూపంలో భక్తులకు అభయమిచ్చారు. తొలి రోజు కావడంతో ఉదయం నుంచే ఆలయాలు అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి.
వైభవంగా విశేష పూజలు..
శ్రీ రంగనాయక స్వామి కాలనీలో ఏర్పాటు చేసిన నవరాత్రి వేదికపై కొలువైన బాల త్రిపురసుందరి దేవికి వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, యువకులు మాజీ ఎంపీపీ భారతమ్మ దొరసాని నమ్మి గరి బాలరాజు, కందూర్ అశోక్ కుమార్, సాగర్ రఘుపతి, సాగర్ నరసింహ, ఈడ్గి సుధాకర్ గౌడ్, బుదురు యాదయ్య, కావాలి బాలసాయిన్న, సంకటి కృష్ణయ్య, నక్క బాలరాజు తదితరులు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చనలు సమర్పించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
అన్నప్రసాద వితరణ..
పూజా కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు భక్తుల కోసం భారీ ఎత్తున అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, సమీప గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తొలి రోజు వేడుకలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.
ఈ నవరాత్రి ఉత్సవాలు రాబోయే తొమ్మిది రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలతో కనులపండువగా సాగనున్నాయి.

ఇళ్ల మధ్యలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టిన యువకులు

కందుకూరు అక్టోబర్ 11 మహాప్రభ
రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల పరిధి లోని కందుకూరు గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడమే లక్ష్యంగా ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, పరిసరాలను శుభ్రం చేసేందుకు గ్రామ కురుమ సంఘము అధ్యక్షులు పాముల శ్రీశైలం, వార్డు సభ్యులు కందడి నర్సింహా పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్ణీత ప్రదేశాల్లోనే వేయాలని సూచించారు. పరిశుభ్రత పాటించడం ద్వారా అనారోగ్య సమస్యలను నివారించవచ్చని తెలిపారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న యువకులను గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని యువకులు తెలిపారు.“మన ఊరు -- మన బాధ్యత, పరిశుభ్రతే మన ప్రాధాన్యత” అనే నినాదంతో ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని యువకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం లో యూత్ అధ్యక్షులు రాము,పాముల కృష్ణ,ఎగ్గిడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏటీఎం ధ్వంసం.. దొంగల స్వైరవిహారం!

-ఏటీఎం యంత్రాన్ని పగలగొట్టి నగదు అపహరణ, స్థానికంగా కలకలం



గాంధారి: అక్టోబర్ 11 (మహాప్రభ)
కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని ఎస్బీఐ ఏటీఎంలో భారీ చోరీ జరిగింది. అంచ కంటే ఎక్కువ డబ్బు పోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గుర్తుతెలియని దుండగులు ఏటీఎం యంత్రాన్ని ధ్వంసం చేసి నగదును అపహరించినట్లు సమాచారం. అయితే ఎంత మొత్తంలో నగదు చోరీకి గురైందనే విషయం ఇంకా తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, ఈ చోరీ స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానిక ఎస్ఐ మహేందర్, చరవాణి ద్వారా మాట్లాడగా.. ఇక పూర్తి వివరాలు ప్రెస్ మీట్ పెట్టి త్వరలోనే సంప్రదిస్తాము అని అన్నారు.



పార్టీ బలోపేతానికి సమష్టి కార్యాచరణ..





-పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి
-కాంగ్రెస్ శ్రేణులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) పిలుపు

దేవరకద్ర నియోజకవర్గం అక్టోబర్ 11 మహాప్రభ
భూత్పూర్, మహబూబ్‌నగర్ జిల్లా: కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతోపాటు, త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఓటరుగా నమోదు చేయించడంపై పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు చేరువ కావాలని, పార్టీ సంస్థాగత బలోపేతానికి సమష్టి కృషి చేయాలని సూచించారు. భూత్పూర్ మున్సిపాలిటీ కేంద్రంలోని కేవీఎన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొని ప్రసంగించారు. ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్ తదితర పార్టీ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జీఎంఆర్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యాచరణ, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం, నాయకులు--కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతరం మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా కృషి చేయాలని సూచించారు. పార్టీ లక్ష్యాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై ప్రత్యేక కార్యాచరణ త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియ అత్యంత ప్రాధాన్యమైనదని ఎమ్మెల్యే జీఎంఆర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు ప్రక్రియను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు. పట్టభద్రులను నేరుగా కలిసి ఓటరు నమోదుకు అవసరమైన వివరాలను తెలియజేయడంతోపాటు, దరఖాస్తు విధానం, సమర్పించాల్సిన పత్రాలపై అవగాహన కల్పించాలని అన్నారు. అర్హులైన వారు ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా పార్టీ శ్రేణులు చొరవ తీసుకోవాలని సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేయడం, పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లడం లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే జీఎంఆర్ పిలుపునిచ్చారు. పార్టీ సంస్థాగత బలోపేతానికి సమష్టి కృషి కీలకమని ఆయన స్పష్టం చేశారు.

కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

-గాంధారి మండల సభ్యుల సమక్షంలో బాధ్యతల స్వీకరణ




గాంధారి: అక్టోబర్ 11 (మహాప్రభ)
కామారెడ్డి జిల్లా పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం అధ్యక్షులు శ్రీ సిరి గాద లక్ష్మి నర్సింలు ఆధ్వర్యంలో గాంధారి మండల సంఘ సభ్యుల సమక్షంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు గుంటుకు అశోక్, జిల్లా కార్యదర్శి కొమ్ముల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శులు చిన్న రాజులు, మడిపెద్ది అంజయ్య తదితరులు జిల్లా పద్మశాలి సంఘ ప్రజలకు, సభ్యులకు ఎల్లవేళలా కట్టుబడి ఉంటామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన గాంధారి మండల సంఘ సభ్యులు, ప్రజలు నూతన కార్యవర్గానికి హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహావిస్కరణ



జోగులాంబ గద్వాల అక్టోబర్ 11 మహాప్రభ
గట్టు మండలం ఆలూరు గ్రామంలో డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహావిస్కరణ చేసిన గద్వాల శాసన సభ్యులు బి కృష్ణ మోహన్ రెడ్డి ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు,గద్వాల మున్సిపల్ వైస్ చైర్మన్ బి శంకర్. అంబేద్కర్ ఆశయాలు ప్రతి ఒక్కరు కొనసాగిద్దాం. అంబేద్కర్ కొందరివాడు కాదు అందరివాడు. భారతరాజ్యంగం ద్వారా అన్ని వర్గాలప్రజలకు సమాన హక్కులు,అవకాశాలు కల్పించిన ఘనత అంబేద్కర్ కే దక్కుతుంది. యువత ఆయన ఆశయాలు,ఆలోచనలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్ల ద్వారా వెనుకబడిన వర్గాలకు రాజకీయ, ఆర్థిక,సామాజిక రంగాల్లో అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఆర్ పి ఎస్ జిల్లా సీనియర్ నాయకులు అశోక్,కన్నా,ఇమ్మనియేలు, పరుష,కే టి దొడ్డి మండల ఇంచార్జీ గువ్వలదిన్నెజాంబయ్యా,ధరూర్ మండల అధ్యక్షుడు అబ్రహం,రంగస్వామి,ఎం ఎస్ పి మండల అధ్యక్షుడు దిందప్ప,తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా 11వ సంవత్సరం ఏకాదశ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు





రాయికల్ అక్టోబర్ 11 మహాప్రభ
ఆధ్యాత్మికత, భక్తిభావం, సనాతన సంప్రదాయాల పరిరక్షణే లక్ష్యంగా ఇటిక్యాల అంగడి బజార్‌లోని నవదుర్గ సేవా సమితి ఆధ్వర్యంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. గత పదేళ్లుగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న ఈ ఉత్సవాలు 2026లో 11వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాయి. అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు పది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, వివిధ అలంకరణలు, పారాయణాలు, ధార్మిక కార్యక్రమాలతో ఉత్సవాలను నిర్వహించనున్నారు.
రోజుకో అలంకరణ.. ప్రత్యేక పూజలు
నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి అలంకరణలు, కుంకుమ పూజలు, సరస్వతీ పూజ, బోనాలు, అన్నదాన కార్యక్రమాలు
తదితర ధార్మిక కార్యక్రమాలతో భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కల్పించనున్నారు. అలాగే ప్రత్యేక పూజలు, హారతులు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళిక రూపొందించారు.
11వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఉత్సవాలు
గత పదేళ్లుగా గ్రామ ప్రజలు, భక్తులు, దాతల సహకారంతో కొనసాగుతున్న నవదుర్గ సేవా సమితి ఉత్సవాలు 11వ సంవత్సరంలో మరింత వైభవంగా నిర్వహించేందుకు సమితి సభ్యులు కృషి చేస్తున్నారు. కుల, మత, వర్ణ, వర్గ విభేదాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చి అమ్మవారి సేవలో భాగస్వాములను చేయడమే సమితి ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొంటున్నారు.
భక్తి, సేవ, ఐక్యతకు ప్రతీకగా నవరాత్రులు
దుర్గాదేవి నవరాత్రులు భక్తి, శక్తి, ధైర్యం, జ్ఞానం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయి. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించనున్నారు. ఈ ఉత్సవాలు ఇటిక్యాల గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు యువతలో భక్తిభావాన్ని, సేవా స్ఫూర్తిని పెంచేందుకు దోహదపడనున్నాయి.
భక్తులు, దాతలు సహకరించాలి
పది రోజుల పాటు నిర్వహించే ఈ మహోత్సవాలను విజయవంతం చేసేందుకు గ్రామ ప్రజలు, మహిళలు, యువత, భక్తులు, దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సహకారం అందించాలని నవదుర్గ సేవా సమితి, అంగడి బజార్ ఇటిక్యాల నిర్వాహకులు కోరుతున్నారు. "అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే" అనే విశ్వాసంతో అమ్మవారి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సమితి సభ్యులు పిలుపునిస్తున్నారు.

వీఎస్ఆర్ నగర్‌లో వైభవంగా దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు

-బాలా త్రిపురసుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు.. తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు



బచ్చన్నపేట అక్టోబర్ 11 మహాప్రభ
మండలంలోని వీఎస్ఆర్ నగర్‌లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ప్రారంభమయ్యాయి. నవదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమైన ఈ ఉత్సవాలను తొమ్మిది రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరి అవతారంలో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో వీఎస్ఆర్ నగర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తొమ్మిది రోజులపాటు నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో నవదుర్గ యూత్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నాగేపల్లిలో పేదలకు ఉచిత వైద్య శిబిరం



మంథని,అక్టోబర్ 11 మహాప్రభ
మంథని మండలంలోని నాగేపల్లి గ్రామంలో వార్డు సభ్యుడు బొమ్మకంటి సతీష్ ఆధ్వర్యంలో కొండపర్తి హరీష్, కొండపర్తి అఖిల నరేష్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న గ్రామ సర్పంచ్ గుమ్మడి సమ్మయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించేందుకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్స తీసుకుంటే ఆరోగ్య సమస్యలను నియంత్రించవచ్చని పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్య బృందం పరీక్షలు చేసి ఆరోగ్యపరమైన సూచనలు అందించింది. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొండపర్తి హరీష్, కొండపర్తి అఖిల నరేష్, వైద్య బృందం, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు..

దసరా సెలవుల్లో పిల్లల బిజినెస్ ప్రయోగం!

-బోడుప్పల్‌లో విద్యార్థుల వినూత్న ప్రయత్నం.



మేడిపల్లి, అక్టోబర్ 11 మహాప్రభ
చదువుతోపాటు జీవిత పాఠాలు, వ్యాపార మెలకువలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో పల్లవి మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న బి. రిషి వాసు దీప్ తన స్నేహితులతో కలిసి దసరా సెలవుల్లో శాంతివనం పార్కు సమీపంలో చిన్న వ్యాపార ప్రయత్నం చేస్తున్నాడు.
పిల్లలు సెలవుల్లో ఖాళీగా గడపకుండా, చిన్నతనం నుంచే బాధ్యతలు, ఆత్మవిశ్వాసం, వ్యాపార నైపుణ్యాలు అలవర్చుకోవాలనే తండ్రి ఆలోచన ఈ ప్రయత్నానికి స్ఫూర్తిగా నిలిచింది. ఈ వినూత్న ప్రయత్నం శాంతివనం పార్కు వాకర్స్‌ను ఆకర్షిస్తోంది. పిల్లలకు చదువుతోపాటు ప్రాక్టికల్ నాలెడ్జ్, వ్యాపార మెలకువలు నేర్పిస్తే భవిష్యత్తులో ఉద్యోగాలు పొందడమే కాకుండా, సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. చిన్న వయసులోనే మంచి ఆలోచన.. భవిష్యత్తులో గొప్ప విజయానికి పునాది!.

నీళ్ళు లేక నేలపైనే బతుకమ్మను నిమజ్జనం చేసిన మహిళలు



జనగామ అక్టోబర్ 11 మహాప్రభ
జనగామ పట్టణంలో ఎంగిలిపూల బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మను నిమజ్జనం చేయడానికి రంగప్ప చెరువు వద్దకు వెళ్లిన మహిళలు అక్కడ నీళ్ళు లేకపోవడం, ప్రభుత్వం ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో భూమిపైనే బతుకమ్మలను నిమజ్జనం చేసి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన మహిళలు

బిజినెస్

వారం రోజుల్లో భారీగా పెరిగిన బంగారం ధర!


-పండుగల సీజన్‌లో పసిడి ధరలకు రెక్కలు
-24 క్యారెట్ల బంగారంపై రూ.2,240 పెరుగుదల
-22 క్యారెట్ల ధర కూడా రూ.2,050 పైకి
-హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.1,51,420
-కిలో వెండి ధర రూ.2.45 లక్షల వద్ద స్థిరం
-రానున్న రోజుల్లోనూ ధరలు పెరిగే అవకాశం



హైదరాబాద్:
పండుగల సీజన్ ప్రారంభం కావడంతో బంగారం ధరలు భారీగా పెరిగాయి. గత వారం రోజుల్లోనే పసిడి ధరలు గణనీయంగా పెరగడంతో కొనుగోలుదారులపై భారం పెరుగుతోంది. అక్టోబర్ 5న హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,49,180గా ఉండగా, అక్టోబర్ 11 ఆదివారం నాటికి రూ.1,51,420కు చేరింది. దీంతో వారం రోజుల్లోనే రూ.2,240 పెరిగింది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర కూడా అదే బాటలో పెరిగింది. అక్టోబర్ 5న 10 గ్రాముల ధర రూ.1,36,750గా ఉండగా, ప్రస్తుతం రూ.1,38,800కు చేరుకుంది. అంటే వారంలో రూ.2,050 పెరిగింది. పండుగలు, శుభకార్యాల కోసం బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి ఈ పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు కిలో వెండి ధర రూ.2.45 లక్షల వద్ద స్థిరంగా కొనసాగుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మళ్లీ రీఛార్జ్ ధరల పెంపు!

-మరోసారి 12 నుంచి 15 శాతం వరకు ధరలు పెరిగే అవకాశం
-వచ్చే నాలుగైదు నెలల్లో టారిఫ్‌ల పెంపునకు అంచనాలు
-జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వినియోగదారులపై ప్రభావం
-5జీ సేవల విస్తరణ, నెట్‌వర్క్ నిర్వహణకు పెరుగుతున్న ఖర్చులు
-వినియోగదారుడి నుంచి సగటు ఆదాయం పెంచుకోవడంపై కంపెనీల దృష్టి
-సామాన్య, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం



న్యూఢిల్లీ
దేశవ్యాప్తంగా మొబైల్ వినియోగదారులకు మరోసారి రీఛార్జ్ ధరల పెంపు ముప్పు పొంచి ఉంది. వచ్చే నాలుగైదు నెలల్లో టెలికాం టారిఫ్‌లు 12 నుంచి 15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. మార్కెట్‌లో పోటీ సంస్థల సంఖ్య తగ్గడం, ధరల పెంపునకు అనుకూల పరిస్థితులు ఏర్పడటం ఇందుకు కారణాలుగా పేర్కొంది. అయితే, టెలికాం కంపెనీలు ధరల పెంపుపై అధికారికంగా ప్రకటన చేయలేదు.

జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా వంటి ప్రధాన టెలికాం సంస్థలు తమ ఆదాయాన్ని పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. 5జీ సేవల విస్తరణ, నెట్‌వర్క్ నిర్వహణ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయాన్ని పెంచుకోవడంపై కంపెనీలు దృష్టి సారిస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి.
ఇప్పటికే రీఛార్జ్ ధరల పెరుగుదలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు మరోసారి ధరలు పెరిగితే అదనపు భారం పడనుంది. నెలవారీ ఖర్చులు పెరగడంతోపాటు, దీర్ఘకాలిక రీఛార్జ్ ప్రణాళికల ఎంపికపైనా వినియోగదారులు ఆలోచించాల్సి రావచ్చు. అయితే, ధరల పెంపు ఎప్పుడు అమల్లోకి వస్తుంది, ఏయే ప్లాన్లపై ఎంతమేర ప్రభావం ఉంటుంది అనే అంశాలపై ఆయా సంస్థల అధికారిక ప్రకటనల తర్వాతే స్పష్టత రానుంది.

ఈ వారం మార్కెట్లకు పరీక్ష!

-ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం
-ద్రవ్యోల్బణ గణాంకాలపై మదుపర్ల దృష్టి
-కంపెనీల త్రైమాసిక ఫలితాలతో షేర్లలో కదలికలు
-ముడి చమురు ధరలు, రూపాయి విలువ కీలకం
-విదేశీ పెట్టుబడిదారుల లావాదేవీల ప్రభావం



ఆచితూచి పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవాలని నిపుణుల సూచన ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ద్రవ్యోల్బణ గణాంకాలు, ప్రముఖ కంపెనీల త్రైమాసిక ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్ గమనాన్ని ప్రభావితం చేయనున్నాయి. దీంతో మదుపర్లు కీలక సూచీల కదలికలను నిశితంగా పరిశీలిస్తున్నారు. మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాల ధోరణి ఆయా పరిణామాలపై ఆధారపడి ఉండనుంది. ఈ వారం కంపెనీల త్రైమాసిక ఫలితాలు కీలకంగా మారనున్నాయి. సంస్థల ఆదాయం, లాభాలు, భవిష్యత్తు వ్యాపార అంచనాలు ఆశాజనకంగా ఉంటే ఆయా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించే అవకాశం ఉంది. ఫలితాలు నిరాశపరిస్తే అమ్మకాల ఒత్తిడి పెరగవచ్చు. మరోవైపు ద్రవ్యోల్బణ గణాంకాలు వడ్డీ రేట్లపై అంచనాలను ప్రభావితం చేయనున్నాయి. ఈ వివరాలను బట్టి మదుపర్లు తమ పెట్టుబడి వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో మార్పులు కూడా దేశీయ మార్కెట్లకు కీలకం కానున్నాయి. చమురు ధరలు పెరిగితే దిగుమతి వ్యయం అధికమై దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరగవచ్చు. దీనికి తోడు విదేశీ పెట్టుబడిదారుల కొనుగోళ్లు, అమ్మకాలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువలో హెచ్చుతగ్గులు మార్కెట్ దిశను నిర్ణయించడంలో ప్రభావం చూపనున్నాయి. ఈ నేపథ్యంలో మదుపర్లు మార్కెట్ పరిణామాలను జాగ్రత్తగా గమనించాలి. కంపెనీల ఆర్థిక పరిస్థితులు, భవిష్యత్తు అంచనాలను విశ్లేషించిన తర్వాతే పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

స్పోర్ట్స్

టీమిండియాతో వన్డే సిరీస్..
న్యూజిలాండ్ విధ్వంసక ఓపెనర్లకు పిలుపు..!

స్వదేశంలో భారత జట్టుతో వన్డే సిరీస్ కోసం న్యూజిలాండ్ క్రికెట్ విధ్వంసక ఓపెనర్లను స్క్వాడ్‌లోకి తీసుకుంది. పలువురు ఆటగాళ్లు గాయపడడంతో.. డేంజరస్ ఫిన్ అలెన్ , టిమ్ సీఫర్ట్ లను ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఆదివారం ఉదయం మిచెల్ శాంట్నర్ సారథిగా 14 మందితో కూడిన పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు. గాయం నుంచి కోలుకున్న చాప్‌మన్, రచిన్ రవీంద్రలకు చోటు దక్కింది.టీమిండియా సవాల్‌కు సిద్ధమవుతున్న న్యూజిలాండ్ వన్డే సిరీస్‌కు స్క్వాడ్‌ను ప్రకటించింది. పలువురు ఆటగాళ్లను గాయాలు వెంటాడుతున్న వేళ తొలి మూడు వన్డేలకు.. చివరి రెండు వన్డేలకు కొన్ని మార్పులతో పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేశారు సెలెక్టర్లు. ఐదు వన్డేల సిరీస్‌లో.. 4, 5వ మ్యాచ్‌లకు సీనియర్ బ్యాటర్ ఫిన్ అలెన్, టిమ్ సీఫర్ట్‌లను తీసుకున్నారు. మూడేళ్ల క్రితం అలెన్ చివరి వన్డే ఆడగా.. సీఫ్టర్ 18 నెలల తర్వాత స్క్వాడ్‌లోకి వచ్చాడు. గాయం నుంచి కోలుకుని ఫిట్‌నెస్ సాధించిన రచిన్ రవీంద్ర, మార్క్ చాప్‌మన్‌లు స్క్వాడ్‌లో చోటు దక్కించుకున్నారు. డెవాన్ కాన్వే, విల్ యంగ్, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్‌తో మిడిలార్డర్ బలంగా కనిపిస్తోంది. ఇక బౌలింగ్ యూనిట్‌లో జాకబ్ డఫ్ఫీ, కైలీ జేమీసన్, మ్యాట్ హెన్రీ, బ్లెయిర్ టిక్నర్ ఉన్నారు. మూడేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్‌లో భారత్‌పై సెమీస్‌లో ఆడిన ఫెర్గూసన్ పేస్ దళంలో





కీలకం కానున్నాడు.
న్యూజిలాండ్ స్క్వాడ్(తొలి మూడు వన్డేలకు): మిచెల్ శాంట్నర్(కెప్టెన్), మైఖేల్ బ్రాస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, నాథన్ స్మిత్, విల్ యంగ్, జాకబ్ డఫ్ఫీ, మ్యాట్ హెన్రీ, కైలీ జేమీసన్, టామ్ లాథమ్(వికెట్ కీపర్), బ్లెయిర్ టిక్నర్.
న్యూజిలాండ్ స్క్వాడ్(4, 5 వన్డేలకు): మిచెల్ శాంట్నర్(కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రాస్‌వెల్, మార్క్ చాప్‌మన్, క్రిస్టియన్ క్లార్క్‌లాకీ ఫెర్గూసన్, మిచ్ హే(వికెట్ కీపర్), నిక్ కెల్లీ, టిమ్ సీఫర్ట్(వికెట్ కీపర్), విల్ యంగ్, జాకబ్ డఫ్ఫీ, మ్యాట్ ఫిషర్, బ్లెయిర్ టిక్నర్.
అక్టోబర్ మూడో వారంలో మూడు ఫార్మాట్ల సిరీస్ కోసం న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది భారత జట్టు. అక్టోబర్ 22 నుంచి శ్రేయాస్ అయ్యర్ సేన, కివీస్ మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఆపై నవంబర్ 4వ నుంచి ఇరుజట్లు ఐదు వన్డేల్లో తలపడతాయి. అనంతరం నవంబర్ 19 నుంచి రెండు టెస్టుల సిరీస్‌లో ఆతిథ్య జట్టును టీమిండియా ఢీకొట్టనుంది.

టెస్టుల్లో తొలి హ్యాట్రిక్..
చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్ పేసర్..!



బంగ్లాదేశ్ క్రికెట్‌లో పేస్ సంచలనంగా మారిన హసన్ మహమూద్ ఈసారి హ్యాట్రిక్‌తో మెరిశాడు. ఆస్ట్రేలియాపై డార్విన్ టెస్టులో చరిత్రాత్మక విజయంలో భాగమైన అతడు అఫ్గనిస్థాన్ తో ఏకైక టెస్టులో వరస బంతుల్లో మూడు వికెట్లతో చెలరేగాడు. తద్వారా సుదీర్ఘ ఫార్మాట్‌లో హ్యాట్రిక్ నమోదు చేసిన బంగ్లాదేశ్ మొట్టమొదటి పేసర్‌గా అవతరించాడు. మొత్తంగా రెడ్ బాల్ క్రికెట్‌లో తమ దేశం నుంచి ఈ ఫీట్ సాధించిన మూడో బౌలర్‌గా హసన్ గుర్తింపు సాధించాడు.అఫ్గనిస్థాన్‌తో అబుధాబీలో జరుగుతున్న ఏకైక టెస్టులో హసన్ మహమూద్ నిప్పులు చెరిగాడు. పదునైన పేస్‌తో కాబూలీ బ్యాటర్లను ఇరుకున పెట్టిన అతడు 83వ ఓవర్లో హ్యాట్రిక్ వికెట్లు తీశాడు. మూడో బంతికి ఇస్మత్ అలంను క్లీన్ బౌల్డ్ చేసిన హసన్.. ఆ తర్వాత బంతికి కైస్ అహ్మద్‌ను వెనక్కి పంపాడు. హ్యాట్రిక్ బంతికి జియా ఉర్ రెహ్మాన్‌ను ఎల్బీగా ఔట్ చేసి చరిత్ర లిఖించాడీ స్పీడ్‌స్టర్. తద్వారా టెస్టుల్లో హ్యాట్రిక్ తీసిన బంగ్లా తొలి పేసర్‌గా హసన్ అవతరించాడు. హసన్ కంటే ముందు టెస్టుల్లో మాజీ స్పిన్నర్లు అలోక్ కపాలి, షోహగ్ గజీలు ఈ ఫీట్ సాధించారు. పాకిస్థాన్‌పై 2003 ఆగస్టులోకపాలి తన స్పిన్ మ్యాజిక్ చూపిస్తూ వరస బంతుల్లో టెయిలెండర్లు షబ్బీర్ అహ్మద్, డానిష్ కనేరియా, ఉమర్ గుల్‌ను పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత పదేళ్లకు న్యూజిలాండ్‌పై గజీ.. కొరే అండర్సన్, వాల్టింగ్, బ్రేస్‌వెల్‌ను ఔట్ చేయడం ద్వారా హ్యాట్రిక్ నమోదు చేశాడు.
వన్డేల్లో ఐదుగురు
అంతర్జాతీయ క్రికెట్ మూడు ఫార్మాట్లను పరిగణిస్తే.. వన్డేల్లో ఐదుగురు బంగ్లా బౌలర్లు హ్యాట్రిక్ వికెట్లతో ఔరా అనిపించారు. షహదాత్ హొసేన్ 2006లో జింబాబ్వేపై, అబ్దుల్ రజాక్ 2010లో జింబాబ్వేపై, రూబెల్ హొసేన్ 2013లో న్యూజిలాండ్‌పై, తైజుల్ ఇస్లాం 2014లో జింబాబ్వేపై, తస్కిన్ అహ్మద్ 2017లో శ్రీలంకపై హ్యాట్రిక్ వీరులుగా నిలిచారు.

రంజీ ట్రోఫీలో జైస్వాల్, రాహుల్‌కు నిరాశ


-రంజీ ట్రోఫీ 2026--27 సీజన్ ప్రారంభం
-తొలి రోజే విఫలమైన భారత టెస్టు జట్టు ఆటగాళ్లు
-పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగిన జైస్వాల్
-కేవలం నాలుగు పరుగులకే ఔటైన కేఎల్ రాహుల్
-ముంబై తరఫున బరిలోకి దిగిన జైస్వాల్
-కర్ణాటక జట్టు తరఫున ఆడిన రాహుల్



భారత దేశవాళీ క్రికెట్‌లో ప్రతిష్ఠాత్మక టోర్నీ అయిన రంజీ ట్రోఫీ 2026--27 సీజన్ ఆదివారం ప్రారంభమైంది. ఈ టోర్నీలో బరిలోకి దిగిన భారత టెస్టు జట్టు ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ తొలి రోజే నిరాశపరిచారు. భారీ ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకుంటారని అభిమానులు ఆశించిన ఈ ఇద్దరు స్టార్ క్రికెటర్లు స్వల్ప స్కోర్లకే పెవిలియన్‌కు చేరారు. ముంబై జట్టు తరఫున చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆడిన యశస్వి జైస్వాల్ పరుగుల ఖాతా తెరవకుండానే ఔటయ్యాడు. ఆరంభంలోనే వికెట్ కోల్పోవడంతో ముంబై జట్టుకు నిరాశ ఎదురైంది. మరోవైపు కర్ణాటక జట్టు తరఫున బరిలోకి దిగిన కేఎల్ రాహుల్ కేవలం నాలుగు పరుగులకే వికెట్ కోల్పోయాడు. ఇద్దరు కీలక ఆటగాళ్లు ఇలా స్వల్ప స్కోర్లకే వెనుదిరగడం అభిమానులను నిరాశకు గురిచేసింది. రంజీ ట్రోఫీలో రాణించి తమ ఆటతీరును మెరుగుపరుచుకోవాలని భావించిన ఈ ఆటగాళ్లకు తొలి మ్యాచ్‌లోనే ఎదురుదెబ్బ తగిలింది. రాబోయే మ్యాచ్‌ల్లో జైస్వాల్, రాహుల్ తిరిగి ఫామ్‌లోకి వచ్చి భారీ స్కోర్లు సాధిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

విజయ్ దేవరకొండ ఫ్యాన్స్‌కు బిగ్ షాక్..

- 'రణబాలి' డబ్బింగ్ వెర్షన్స్ విడుదల వాయిదా!



టాలీవుడ్ సెన్సేషనల్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'రణబాలి' కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పెళ్లి తర్వాత ఈ క్రేజీ కాంబో తెరపైకి వస్తుండటం, అటు 'టాక్సీవాలా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత రాహుల్ సాంకృత్యాన్ -- విజయ్ కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే అనుకున్న తేదీ ప్రకారం ఈ సినిమా అక్టోబర్ 16న దసరా కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. అయితే, ఓవర్సీస్ మార్కెట్లోని ప్రేక్షకులకు, ముఖ్యంగా నాన్-తెలుగు విజయ్ ఫ్యాన్స్‌కు మేకర్స్ నుంచి నిరాశ కలిగించే అప్‌డేట్ అందింది. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ల సమాచారం ప్రకారం.. అక్టోబర్ 16న విడుదల రోజున విదేశాల్లో కేవలం ఒరిజినల్ తెలుగు వెర్షన్ మాత్రమే ప్రదర్శించబడుతుంది. ఇతర భాషల డబ్బింగ్ వెర్షన్‌లకు సంబంధించిన కంటెంట్ సిద్ధం చేయడంలో ఏర్పడిన ఆలస్యం కారణంగా, వాటి రిలీజ్‌ను అక్టోబర్ 23కి వాయిదా వేశారు. మరోవైపు, ఓవర్సీస్ మార్కెట్‌లో ఈ సినిమాకు సంబంధించి అడ్వాన్స్ బుకింగ్స్ జోరుగా సాగుతున్నాయి. ప్రముఖ థియేటర్ చైన్‌లలో ఇప్పటికే టిక్కెట్ల అమ్మకాలు ప్రారంభం కాగా, కేవలం ప్రీ-సేల్స్ ద్వారానే సినిమా 50 వేల డాలర్ల మార్కును దాటడం విశేషం. రాబోయే రోజుల్లో ప్రీమియర్ కలెక్షన్స్ ఏ స్థాయిలో ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అద్భుతమైన బాణీలు అందిస్తున్న ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.



రజనీకాంత్ 'ధర్మన్'పై భారీ అంచనాలు..

-2027 సంక్రాంతి నుంచి వేసవికి వాయిదా?



సూపర్‌స్టార్ రజనీకాంత్ అభిమానులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ ఆసక్తి పెంచుతున్న చిత్రాల్లో 'ధర్మన్' ఒకటి. విభిన్న కథాంశాలతో సినిమాలు తెరకెక్కించే దర్శకుడు అశ్విత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మాణ బాధ్యతలు చేపడుతున్న ఈ ప్రాజెక్టులో రామ్ పోతినేని, రాశీ ఖన్నా, సిమ్రాన్, యోగి బాబు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం కావడంతో ఈ సినిమాపై అంచనాలు పెరుగుతున్నాయి. అయితే మొదట అనుకున్న విడుదల తేదీ విషయంలో మార్పులు జరిగే అవకాశం ఉందనే వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.రజనీకాంత్ నటిస్తున్న సినిమాలంటే ప్రేక్షకుల్లో సహజంగానే భారీ అంచనాలు ఉంటాయి. ముఖ్యంగా 'జైలర్' విజయంతో ఆయన తదుపరి ప్రాజెక్టులపై అభిమానులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో 'జైలర్ 2' తర్వాత 'ధర్మన్' గురించి వస్తున్న వార్తలు ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. అయితే ఈ చిత్రానికి సంబంధించిన నటీనటులు, కథ, విడుదల తేదీ వంటి వివరాలపై అధికారిక ప్రకటనల కోసం ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. దర్శకుడు అశ్విత్ మారిముత్తు గతంలో 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి చిత్రాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. వినోదంతో పాటు భిన్నమైన కథనాన్ని అందించే ప్రయత్నం ఆయన సినిమాల్లో కనిపిస్తుంది. అలాంటి దర్శకుడు ఈ భారీ ప్రాజెక్టును ఎలా రూపొందించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది. రజనీకాంత్ పేరుతో ముడిపడిన ఈ చిత్రం గురించి వస్తున్న అంచనాలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. ఈ సినిమాకు కమల్ హాసన్ నిర్మాతగా వ్యవహరిస్తుండటం మరో ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. నటుడిగా ఎన్నో ప్రయోగాత్మక చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న కమల్ హాసన్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ ప్రాజెక్టు ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది. భారీ తారాగణం, అనుభవజ్ఞులైన సాంకేతిక బృందం కలిసి పనిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో నిర్మాణ విలువలపైనా అంచనాలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం 'ధర్మన్' విడుదల తేదీపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ సినిమాను మొదట 2027 సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని భావించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు విడుదల ప్రణాళికల్లో మార్పులు జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కమల్ హాసన్ తన మరో చిత్రం 'ఇండియన్ 3'ను పండగ సీజన్‌లో విడుదల చేయాలని యోచిస్తున్నారనే వార్తల నేపథ్యంలో 'ధర్మన్'ను 2027 వేసవికి వాయిదా వేయవచ్చని సినీ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ఏమీ చేయలేకే గతాన్ని తవ్వుతారు!

'మనల్ని విమర్శించడానికి ఏమీ దొరకనప్పుడు మన గతాన్ని వెలికితీస్తారు. చవకబారు ఆరోపణలు చేసి ఏదో సాధించామని సంబరపడిపోతారు. నా విషయంలో అదే జరిగింది. ఎవరితోనైనా ప్రేమగా మాట్లాడినా, చిరునవ్వుతో పలకరించినా లవ్‌ఎఫైర్ అంటూ ప్రచారం చేశారు. నా స్నేహితుల దగ్గరి నుంచి ప్రేమించే వ్యక్తుల వరకూ.. ప్రతి ఒక్కరిని పరిచయం చేయడానికి నేను ఇష్టపడతాను. ఎప్పటికప్పుడు నా సినిమా విశేషాలను పంచుకుంటూ సోషల్‌మీడియాలో చురుగ్గా ఉంటాను. ఇంత ఓపెన్‌గా ఉంటున్నప్పటికీ నా మీద ఎందుకు పుకార్లు వ్యాప్తి చేస్తారో అర్థం కాదు. కొన్నిసార్లు వారి వినోదం కోసం వ్యక్తిగత జీవితాలను టార్గెట్ చేస్తుంటారు' అని మృణాల్ ఠాకూర్ చెప్పుకొచ్చింది. ఆమె తాజా చిత్రం 'పూజా మేరీ జాన్' ఇటీవలే ఓటీటీలో ప్రేక్షకుల ముందుకొచ్చింది.

తమిళ దర్శకుడితో భారీ అడ్వెంచర్?



వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సిక్' సినిమా ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. ప్రస్తుతం నితీష్ తివారీ 'రామాయణం'లో రావణుడిగా నటిస్తూ యశ్ బిజీగా ఉన్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా రూపొందుతున్నది. ఈ చిత్రానికి సంబంధించిన తొలి భాగం దీపావళి కానుకగా విడుదల కానున్న విషయం తెలిసిందే.మరి 'రామాయణ' ఫ్రాంచైజీ తర్వాత యశ్ చేసే సినిమా ఏంటి? ఆయన సోలో హీరోగా ఎవరి దర్శకత్వంలో నటిస్తారు? అనే ప్రశ్నలు ఫిల్మ్ సర్కిల్స్‌లో ప్రస్తుతం చర్చనీయాంశాలుగా మారాయి. అయితే.. తాజాగా తమిళ దర్శకుడు పీఎస్ మిత్రన్ ఇచ్చిన అప్‌డేట్‌తో ఈ చర్చలకు ఫుల్‌స్టాప్ పడ్డట్టయింది. 'ఇండియానా జోన్స్' తరహాలో ఒక భారీ అడ్వెంచర్ కథను ఇటీవలే యశ్‌కు వినిపించానని, యశ్‌కు కూడా ఆ కథ బాగా నచ్చిందని, 'రామాయణ' కమిట్‌మెంట్స్ పూర్తయ్యాక, ఈ ప్రాజెక్ట్ వర్క్ మొదలవుతుందని మిత్రన్ చెప్పారు. ఇది యశ్ అభిమానులకు నిజంగా శుభవార్తే.

జూనియర్ సైంటిస్ట్‌గా శర్వానంద్..

-రామోజీ ఫిల్మ్‌సిటీలో 'జార్జ్ క్రిష్' ఊరమాస్ షూటింగ్!



టాలీవుడ్ హీరో శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'జార్జ్ క్రిష్' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అయితే ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచేందుకు వస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో చిత్ర యూనిట్ అత్యంత భారీ సెట్లను నిర్మించినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం అక్కడే ఒక అద్భుతమైన షెడ్యూల్‌ను కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే హీరో శర్వానంద్‌పై ఒక అదిరిపోయే 'జార్జ్ క్రిష్' టైటిల్ సాంగ్‌ను గ్రాండ్‌గా షూట్ చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో శర్వానంద్ చాలా డిఫరెంట్‌గా జూనియర్ సైంటిస్ట్ పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన క్యారెక్టర్ చుట్టూ నడిచే సన్నివేశాలు, వైట్ల మార్క్ కామెడీ టైమింగ్ సినిమాకే హైలైట్‌గా నిలవనున్నాయి. ఫుల్-లెంగ్త్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ చిత్రంలో ఎన్నో హిలేరియస్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలాఉంటే, ఈ సినిమాలో శర్వానంద్ సరసన అందాల భామ మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి మధ్య వచ్చే లవ్ ట్రాక్ పూర్తిగా ట్రెండీగా, యూత్‌ను ఆకట్టుకునేలా వైవిధ్యమైన ఫన్ పాయింట్ ఆఫ్ వ్యూలో సాగుతుందని తెలుస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై అనిల్ సుంకర అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంగీత సంచలనం అనూప్ రూబెన్స్ అద్భుతమైన బాణీలు అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి ఈ సినిమాను సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వైట్ల మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్ తో పాటు శర్వానంద్ ఎనర్జిటిక్ యాక్టింగ్ తో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి మరి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com